4 పేజీలు: 7 నయాపైసలు ANDHRA JANATHA

200208

HYDERABAD Regd No: H 634

ఆంధ్రజనత

హైద్రాబాద్, బుధవారం 14-10-1959

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

సంపుటి 5 సంచిక 108

ఆంధ్రజనత
చందా వివరాలు
సంవత్సరం రూ. 27-00
6 నెలలు రూ. 14-00
3 నెలలు రూ. 7-00
మూడు నెలలకు తక్కువ చందా స్వీకరించబడదు.
వివరాలకు:
మేనేజర్,
ఆంధ్ర జనత
గాంధీ భవనం, హైదరాబాదు.

ప్రెసిడెంట్
బెస్టబుల్ హెరాయిల్, స్నో టాల్కంపౌడర్
RATHOD TRADING CO., MADRAS1

ఉమ్మడి సేద్యంలో భూమిపై రైతుకు యాజమాన్యం హక్కు

నెల్లూరు బహిరంగ సభలో ప్రధాని నెహ్రూ ప్రకటన

డిగాల్‌తో చర్చలకు అబ్బాస్ సంసిద్ధత

పారిస్, అక్టోబర్ 13

తానూ, ఫ్రాన్సు అధ్యక్షుడు జనరల్ డిగాల్ కూడా స్వయం నిర్ణయ సూత్రాన్ని అంగీకరించామని అల్జీరియా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని ఫెర్హత్ అబ్బాస్ చెప్పినట్లు ఫ్రెంచి పత్రిక 'జూర్ డిఫ్రాన్స్' వెల్లడించింది. ఈ పత్రిక ప్రతినిధి అబ్బాస్‌ను ట్యూనిస్‌లో ఇంటర్ వ్యూ చేశారు.

ఫ్రాన్సు అధ్యక్షుని కలుసుకునేందుకు గూడా అబ్బాస్ సంసిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఫ్రాన్సులో తాము కలసి ఉండాలని రిఫరెండంలో నూటికి 61 మంది వెల్లడిస్తే ఆ నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని కూడా శ్రీఅబ్బాస్ అన్నట్లు ఈ పత్రిక ప్రకటించింది.

'డిగాల్ క్రమంగా శాంతిని కోరుతున్నారు. మేము తక్షణమే శాంతిని కోరుతున్నాము' అన్నారు అబ్బాస్.

పారిస్ వచ్చి చర్చలను జరప డానికి తన ప్రభుత్వ ప్రతినిధి వర్గం సిద్ధంగా ఉందనీ, అయితే వారిని నిర్బంధించడం గాని, చర్చలు విఫలమైనా నిర్బంధ చర్యలు తీసుకోవడం జరగదని హామీ ఇవ్వాలని ఆయన అన్నారు.

ఈ ప్రతినిధి వర్గంలో అల్జీరియా జాతీయ విమోచన సమితి నాయకుడు [redacted] ఉంటారని ఆయన అన్నారు.

బలవంత విధానాలకు ఎన్నటికీ పూనుకోమని పునరుద్ఘాటన

నెల్లూరు, అక్టోబర్ 13

సహకార సేవా సంఘాలలో కాని, ఉమ్మడి వ్యవసాయంలో కాని భూమి యాజమాన్యం హక్కులు రైతు పరంగానే ఉండాలని తమ అభిప్రాయమైనట్టు ప్రధాని నెహ్రూ నేడు ఇక్కడ బహిరంగ సభలో ప్రకటించారు.

ఎట్టి పరిస్థితులలోను రైతులను ఉమ్మడి వ్యవసాయానికి అంగీకరించాలని బలవంత పెట్టడం జరగదని కూడా శ్రీ నెహ్రూ స్పష్టీకరించారు.

ఉమ్మడి వ్యవసాయం అనేది సహకారోద్యమంలోని మరో అంశమని సహకార సేవాసంఘాల అనంతరం గ్రామీణప్రజలు దీనినిగురించి యోచించవచ్చునని ఆయన అన్నారు.

ప్రతిగ్రామంలోను సహకార సేవా సంఘాలు మొదటిమెట్టు. తర్వాతప్రజలు కోరిన చోటల్లా వారు రెండవ మెట్టుకు- ఉమ్మడి వ్యవసాయానికి- వెళ్ళవచ్చునని ఆయన అన్నారు.

అయితే చిన్నకమతాలుగల రైతులు విడివిడిగా అవలంబించలేని నూతన వ్యవసాయ పద్ధతులను ఉమ్మడి వ్యవసాయంలో అవలంబించటం సాధ్యమని ప్రధాని అన్నారు.

గ్రామ[illegible] సుస్థిరంచేయటానికి గ్రామపంచాయతీలు, గ్రామీణ సహకార సంఘాలు, పాఠశాలలు-ఈ మూడు చాలా అవసరమని ప్రధాని అన్నారు.

సహకార సేవా సంఘాలు, గ్రామ పంచాయతీల ద్వారా గ్రామస్తులు ఆర్థికాభివృద్ధిని సాధించ వచ్చు. పాఠశాలలు, ఆస్పత్రులు, రోడ్లు నిర్మించ వచ్చు. పరిశ్రమలను వృద్ధి పరచ వచ్చు అని ప్రధాని అన్నారు.

గ్రామాలలో కేవలం అధికారుల చేత పని చేయించడం వల్ల గ్రామాభ్యుదయం సాధ్యం కాదని, గ్రామస్తులు స్వయంగా పని చేయాలని ప్రధాని అన్నారు. పంచాయతీలు, పంచాయతీ సమితుల క్రింద ప్రజలకు అధికారాలు ఇస్తారు. వారు గ్రామాభివృద్ధికి పని చేయవచ్చు అని ఆయన అన్నారు.

ఈ నూతన ఏర్పాట్లు గ్రామస్తులను "నిజమైన స్వరాజ్యం" లోనికి తీసుకొని వెడుతుందని, అందు చేత వారు తమ అధికారాలను మెలకువతో ఉపయోగించుకోవాలని ఆయన ఉద్బోధించారు.

నగరంలో భూకంపం

హైద్రాబాద్, అక్టోబర్ 13

నిన్నటి దినం అర్ధ రాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు హైద్రాబాద్ నగర ప్రాంతంలో ఒక సెకను పాటు భూమి కంపించింది. తలుపులు, కిటికీలు, బల్లల మీద ఉంచిన వస్తువులు కంపించి పోయాయి. నిద్రపోతున్న ప్రజలు గాబరాపడి లేచారు. ఈ భూకంపంతో పాటు ఉరుము వంటి శబ్దం కూడా వినిపించింది. కొద్ది తీవ్రతగల భూకంపం హైద్రాబాద్ నగరంలో వచ్చినట్టు బేగంపేట వాతావరణ పరిశోధక కేంద్రం అధికారులు ధృవ పరిచారు. ఈ భూకంప కేంద్రం మొదలగు వాటిని గురించి సవివరాలు ఇంకా తెలియలేదు. విజయవాడ నగరంలో కూడా ఒక సెకను పాటు భూమి కంపించినట్టు వార్తలు వచ్చాయి.

భూమి కంపించటంవల్ల భీతావహులైన 200 మంది ప్రజలు సుల్తాన్ బజార్‌లో పోలీస్ స్టేషన్ వద్ద గుమిగూడారు. అసిస్టెంట్ కమీషనర్ శ్రీ పద్మారెడ్డి, నగర కార్పొరేషన్ కమీషనర్ శ్రీ శాస్త్రి వెంటనే సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చి, ప్రజలకు ధైర్యం చెప్పారు.

కాంగ్రెస్, స్వతంత్ర పార్టీల పోటీ వల్ల ప్రజలకు లాభం శూన్యం

డాక్టర్ లోహియా ప్రకటన

("ఆంధ్రజనత" విలేఖరి)

హైద్రాబాద్, అక్టోబర్ 13

స్వతంత్ర పార్టీవారు "పాదుపరులు, సంకుచిత మనస్తత్వం కలవారు, అధికార భ్రష్టత్వం పొందిన పెట్టుబడిదారులని, కాంగ్రెస్ పార్టీ వారు విలాస జీవితం గడుపుతున్న వారు, కొంచెం విశాల దృక్పథం కలవారు, పదవిలో ఉన్న పెట్టుబడి దారులు" అని సోషలిస్టు నాయకుడు డాక్టర్ రాం మనోహర్ లోహియా నేడు వర్ణించారు.

ఇక్కడ పత్రికా విలేఖరుల గోష్ఠిలో ప్రసంగిస్తున్న శ్రీ లోహియా కాంగ్రెస్, స్వతంత్ర పార్టీల మధ్య పోరాటం వల్ల భారత ప్రజలకు జరిగే లాభమేమీలేదని అన్నారు.

ఈ దేశంలో తమ పార్టీ ఒక్కటే వామపక్ష సోషలిస్టు పార్టీ అని, ఇది చాలా బలహీనమైన పార్టీయే ఐనప్పటికీ ఒంటరిగానే పోరాటం సాగిస్తున్నదని ఆయన అన్నారు. "బహుశా మా పరాజయాలపైనే నూతన శక్తి నిర్మింపబడవచ్చు" అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో చక్కెర సరఫరాకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

పంపిణీ పద్ధతులను క్రమబద్ధం చేయాలని ప్రభుత్వ నిర్ణయం

హైద్రాబాద్, అక్టోబర్ 13

చక్కెర పంపిణీని క్రమబద్ధం చేయాలని, దైనందిన వ్యవహారాలలో జోక్యం కలుగజేసు కోకుండానే ప్రతివ్యక్తికి కోరినంత చక్కెర లభించేటట్టు చేయడానికిగాను పంపిణీ పద్ధతులను కంట్రోలులో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినది.

చక్కెర సరఫరా ఏర్పాట్ల గురించి ఈరోజున జారీచేసిన ఒక పత్రికా ప్రకటన ఇలా తెల్పుతున్నది:

"పంచదార ఉత్పత్తిలో ఈ రాష్ట్రం మిగులు ప్రదేశమైనప్పటికీ నేడు దక్షిణ మండలంలోని ఇతర రాష్ట్రాలలో గల అధిక ధర కారణంగా ఇక్కడ సరుకు క్రమేణా తగ్గి తత్ఫలితంగా ధర పెచ్చుతున్నది. రాష్ట్రంలో సరిపడ్డ పంచదారను వుంచి, దాని ధర పెరుగుదలను అరికట్టటానికై పంపిణీని చట్టబద్ధం చేసి, అది వినియోగదారుకు చేరే దశవరకు పంపిణీపై ప్రభుత్వ కంట్రోలు ఉండాలని నిర్ణయించారు. అత్యవసరమైతే తప్ప మామూలు వ్యాపార సరళితో జోక్యం చేసుకోకుండాను, వినియోగదారులకు మామూలు కిరాణా దుకాణాలలో కావలసిన పంచదార దొరికేటట్టు చూడమని జిల్లా కలెక్టర్లకి ఆదేశాలు ఇవ్వబడినవి. మామూలు కిరాణా దుకాణాలన్నిటికి ఇది వరకు అని అమ్మే సరుకు ప్రమాణానికి అనుగుణంగా పంచదార కోటాలు సరఫరా అయ్యేటట్టు, ఏ దుకాణ దారుకూడా మామూలుగా తనవద్ద సరుకు కొనేవారికి పంచదారలేదని అనకుండా ఉండేట్టు చూడాలని కలెక్టర్లకు ఆదేశాలివ్వబడినవి.

"ప్రజలు ఈ విషయంలో ప్రభుత్వంతో పూర్తిగా సహకరించాలి. వారు సాధారణంగా ఒక్కసారి ఎంత పంచదార కొనుక్కుంటారో అంతే కొనుక్కోవాలి. కిరాణా దుకాణాదారైనా పంచదార లేదంటే ఆ విషయం కలెక్టర్‌కి కాని, అందుకు సంబంధించిన రెవెన్యూ అధికారికి గాని తెలియజేస్తే అట్టి దుకాణాదారుపై తగిన చర్య తీసుకోబడుతుంది. పంచదార అమ్మకంలో దుర్నడత వల్ల ఏదుకాణాదారుకైనా పంచదార కోటా ఇవ్వబడక పోతే ప్రజలు దానిని కలెక్టర్లు ప్రకటించిన ఇతర దుకాణాలలో కొనుక్కోవాలని కోరబడుతున్నది."

ఎక్స్‌ప్రెస్ పత్రికల వివాదం

ఉద్యోగుల అప్పీలు పాక్షికంగా ఆమోదం

మద్రాస్, అక్టోబర్ 13

ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికల ఉద్యోగులకు, యజమానులకు మధ్య ఏర్పడిన వివాదాన్ని పారిశ్రామిక ట్రిబ్యునల్ పరిశీలించరాదని నిషేధిస్తూ న్యాయమూర్తి శ్రీ పి. వి. బాలకృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పుపై జర్నలిస్టులు చేసుకొన్న అప్పీలును మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచి నేడు పాక్షికంగా ఆమోదించినది.

నిషేధాజ్ఞను తొలగిస్తూ ఎక్స్‌ప్రెస్ గ్రూపు ఉద్యోగుల సమ్మె న్యాయ సమ్మతమేనా అనే విషయము సమ్మెను పురస్కరించుకొని యజమానులు పత్రికలను శాశ్వతంగా మూసివేస్తున్నామని చెబుతూ తీసుకొన్న చర్య నిజమైన మూసివేత నేనా లేక మూసివేత అనే ముసుగు క్రింద వాకౌట్ అనే విషయాన్ని ట్రిబ్యునల్ పరిశీలించవచ్చునని బెంచి తీర్పు ఇచ్చినది. యజమానుల చర్య లాకౌట్ అని ట్రిబ్యునల్ అభిప్రాయ పడితే ఉద్యోగులకు కల్పించే సౌకర్యాల గురించి పరిశీలించవచ్చునని, ఒక వేళ ఇది నిజమైన మూసివేతనే అని భావిస్తే ఈ విషయాన్ని ట్రిబ్యునల్ పరిశీలించ జాలదని, అయితే పారిశ్రామిక వివాదాల చట్టం క్రింద ఉద్యోగులకు ఇచ్చిన పరిహారం సరిగా ఉందా లేదా మాత్రమే చూడవచ్చునని కోర్టు నిర్ణయించినది.

కళాశాలలో ప్రేమకలాపాలపై నిషేధం

కరాచీ, అక్టోబర్ 13

కళాశాల ఆవరణంలో ఆడపిల్లలు, మగపిల్లలు ఒకరితో ఒకరు మాట్లాడుకో కూడదని ఒక స్థానిక విద్యాసంస్థ అధికారులు ఇటీవల ఆంక్ష విధించారు.

దీనికి వ్యతిరేకంగా నడుచుకొన్నట్టయితే తొలి జుమానగా మొదట 5 రూపాయల జరిమానా, అప్పటికీ ఇంకా దారికి రాకపోయినట్టయితే కాలేజీ నుంచి బహిష్కరించ బడటం కూడా జరగవచ్చు.

విద్యార్థుల మధ్య ప్రేమ కలాపాలను అరికట్టటానికి ఈ చర్య తీసుకొన్నట్టు కళాశాల అధికారులు అన్నారు.

పాకిస్తాన్‌లో కూడా ఐసెన్‌హోవర్ పర్యటన

వాషింగ్టన్, అక్టోబర్ 13

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ భారత దేశాన్ని సందర్శించినప్పుడు పాకిస్తాన్‌ను కూడా సందర్శించగలరని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

ఇండియాలో ఐసెన్‌హోవర్ పర్యటనకు ఇంకా కాలనిర్ణయం జరుగకపోయినా వచ్చే వసంతకాలంలో రష్యా పర్యటన తరువాత ఆయన ఇండియాకు రావచ్చని ఇక్కడివారు భావిస్తున్నారు.

టిబెట్ సమస్యపై తీర్మానం ప్రతిపాదన

ఐక్యరాజ్యసమితి, (న్యూయార్క్), అక్టోబర్ 13

టిబెట్‌లో పరిస్థితిపై ఐర్లండ్, మలయా దేశాలు నేడు సమితి జనరల్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రతిపాదించాయి.

టిబెట్ పరిస్థితిని చర్చించాలని అసెంబ్లీ నిర్ణయించిన 12 గంటల లోపలే పై తీర్మానాన్ని ప్రతిపాదించటం జరిగినది.

టిబెట్ ప్రజల మానవ హక్కులను, సంస్కృతిని రక్షించాలని తీర్మానంలో పేర్కొన బడినది.

టిబెట్ సమస్యపై చర్చకు జనరల్ అసెంబ్లీ నిర్ణయం

రష్యన్ ప్రతినిధి తీవ్ర విమర్శ

న్యూయార్క్, అక్టోబర్ 13

టిబెట్ సమస్యపై చర్చ జరపాలని మిత్రరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ నేడు నిర్ణయించినది.

ఈ సందర్భంలో రష్యా ప్రతినిధి వానిలీ కుజ్నట్సోవ్ మాట్లాడుతూ ప్రచ్ఛన్న యుద్ధాన్ని రెచ్చగొట్టే ఉద్దేశంతోనే ఈ సమస్యను చర్చకు పెట్టడం జరుగుతున్నదని విమర్శించారు. వివిధ రాజ్యాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొంటున్న సమయంలో సమావేశాలలో ప్రచ్ఛన్న యుద్ధాన్ని ప్రేరేపించడానికి ఉద్దేశించ బడిన చర్చలు తీసుకొనబడుతున్నాయని ఆయన విమర్శించారు. శాంతిని నెలకొల్పడానికి ప్రతిబంధకాలుగా ఉన్న సమస్యలన్నిటిని ప్రక్కకు నెట్టి వేయ వలసిందని ఆయన విజ్ఞప్తి చేశారు.

రష్యన్ ప్రతినిధి విమర్శలకు అమెరికన్ ప్రతినిధి కాబట్ లాడ్జ్ సమాధానం చెపుతూ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం తొలగించాలన్న భావంతో ప్రపంచంలో జరుగుతున్న అక్రమాలను మనం అలక్ష్యం చేస్తే ప్రపంచం ప్రమాద పరిస్థితికి లోనవుతుందనీ, చిన్న దేశాలకు రక్షణ అనేది ఉండదనీ అన్నారు.

టిబెట్‌పై చర్చ జరపాలన్న తీర్మానానికి అనుకూలంగా 43 ఓట్లు వచ్చాయి. 26 దేశాలు ఓటింగులో పాల్గొన లేదు. తీర్మానానికి వ్యతిరేకంగా 11 వోట్లు వచ్చాయి. ఇజ్రాయిల్, ఇథియోపియా ప్రతినిధులు ఓటింగుకు హాజరు కాలేదు. భారతదేశం తాటస్థ్యం వహించింది.

న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, అక్టోబర్ 13	
నేటి ప్రారంభ ధర	32.15
నేటి ముగింపు ధర	32.

సరిహద్దులపై చైనా దురాక్రమణ

వ్యాఖ్యానించటానికి రష్యా రాయబారి నిరాకరణ

ఖిలాయ్, అక్టోబర్ 13

భారత సరిహద్దులపై చైనా దురాక్రమణ గురించి నిన్న రాత్రి ఇక్కడ విలేఖరులడిగిన ప్రశ్నలకు సమాధాన మివ్వటానికి రష్యా రాయబారి శ్రీ ఐ. ఎ. బెసెదిక్తోవ్ నిరాకరించారు.

ఆ విషయాన్ని గురించి తాము ఆలోచించలేదని, అందుకు సమాధానాలు ఇవ్వజాలమని ఆయన అన్నారు.

సోవియట్ యూనియన్ సహాయంతో నిర్మించిన ఖిలాయ్ ఉక్కుయంత్రాగారంలో ఉక్కు కడ్డీల ఉత్పత్తి ప్రారంభమైన సందర్భంలో ఏర్పాటుచేయబడిన ఒక విందులో బెసెదిక్తోవ్ విలేఖరులను కలిశారు.

ఐసెన్‌హోవర్, కృశ్చేవ్‌ల మధ్య ఇటీవల జరిగిన సమావేశం ఫలితాలు ఆశించిన దానికన్నా ఎక్కువ ఆశాజనకంగా ఉన్నాయని, ఉభయ నాయకులమధ్య ఇంకా కొన్ని అభిప్రాయభేదాలున్నప్పటికీ, శఖరాగ్ర సమావేశం జరిగి తీరుతుందని అమెరికన్ ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు.

భారతదేశానికి రష్యా ఇస్తున్న రుణ సహాయం వల్ల ఈదేశం పారిశ్రామికీకరణకు చాలా సహాయం లభించగలదని ఆయన అన్నారు.

దేశంలో ఒక నూనెశుద్ధికర్మాగారం, మూడు భారీ విద్యుచ్ఛక్తి పరికరాల ఫ్యాక్టరీల నిర్మాణానికేగాక, ఖిలాయ్ ఉక్కు ఫ్యాక్టరీ ఉత్పత్తిని 10 లక్షల టన్నుల నుంచి 20 లక్షల టన్నులకు వృద్ధి పరచటానికి కూడా ఈ రుణం ఉపయోగ పడగలదని ఆయన అన్నారు.

ఈ రుణం కారణంగా దేశంలో సోషలిస్టు ఉద్యమం బలపడి, నూనె వ్యాపారాన్నంతటనీహస్తగతంచేసుకొని కూర్చున్న సోషలిస్టేతర దేశాలు గుత్త వ్యాపారానికి ఉద్వాసన చెబుతుందని కూడ బెసెదిక్తోవ్ అన్నారు.

బ్రిటిష్ ప్రధానికి నెహ్రూ అభినందనలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 13

ఎన్నికలలో హెరాల్డ్ మాక్మిలన్, ఆయన పార్టీ తిరిగి విజయం పొందినందుకు బ్రిటిష్ ప్రధానిని అభినందిస్తూ శ్రీ నెహ్రూ సందేశాన్ని పంపారు. ఈ సందేశం వ్యక్తిగత లేఖ రూపంలో పంపబడినది.

సహకార విధానమే సర్వోత్తమ సాధనం

ప్రధాని నెహ్రూ ఉద్ఘాటన: చీరాలలో నూలు మిల్లుకు ప్రారంభోత్సవం

చీరాల, అక్టోబర్ 13

చీరాల సహకార నూలు మిల్లు భవనానికి ప్రధాని నెహ్రూ నేటి ఉదయం ప్రారంభోత్సవం చేసారు. ప్రజలు సహకార విధానంలో కృషి చేస్తేనే దేశం పురోభివృద్ధి చెందగలదని శ్రీ నెహ్రూ శంకుస్థాపనోత్సవ సందర్భంలో ఉద్ఘాటించారు.

శంకుస్థాపన ఉత్సవ సందర్భంలో జరిగిన మహాసభకు అశేషమందికి పైగా ప్రజలు హాజరైనారు. సభకు అధిక సంఖ్యలో "మన సోదరీ మణులు" హాజరైనందుకు శ్రీ నెహ్రూ హర్షం ప్రకటించారు. దేశంకోసంపురుషులు, స్త్రీలు కలసి పనిచేయటం అవసరంగనుక స్త్రీలు ఎక్కువ మంది సభలో పాల్గొని ఉంటారని శ్రీ నెహ్రూ అన్నారు.

దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికులు నిర్వహించిన ప్రముఖ పాత్రను ప్రభుత్వం గుర్తించినదని శ్రీ నెహ్రూ అన్నారు. ఎన్ని చిక్కులు ఉన్నప్పటికీ చేనేత పారిశ్రామికులు చక్కటి వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నారని శ్రీ నెహ్రూ ప్రశంసించారు.

ఈ ప్రాంతాలలో చేనేత పరిశ్రమ ఎంతో మందికి ఉద్యోగ వసతి కల్పిస్తు

(మిగతా 4వ పేజీలో)

కృష్ణా జిల్లాలో మరి కొన్ని పంచాయతీ సమితులు

విజయవాడ, అక్టోబర్ 13

కృష్ణా జిల్లాలో ఈ క్రింది బ్లాక్‌లలో పంచాయతీ సమితులను స్థాపించడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం అవనిగడ్డ, కంచికచర్ల, నందిగామ, గన్నవరం, వీరవల్లి, కైకలూరు, గూడూరు, బంటుమిల్లి, మైలవరం, మోటూరు, నూజివీడు, ముసునూరు, తిరువూరు, విస్సన్నపేట బ్లాక్‌లలో పంచాయతీసమితులు ఏర్పడతాయి. ఈ సమితుల సభ్యులు, అధ్యక్షులు ఈ నెలాఖరులోగా ఎన్నుకోబడతారు.

లావోస్ నుంచి సమితి పరిశీలక దళం ప్రయాణం

వియంటైన్, అక్టోబర్ 13

లావోస్ పోరాటానికి సంబంధించిన నిజపరిస్థితిని తెలుసుకోటానికి గాను ఇక్కడికి వచ్చిన ఐక్యరాజ్యసమితి పరిశీలక దళం నేడు ఇక్కడి నుంచి న్యూయార్క్ బయల్దేరి వెళ్ళినది. న్యూయార్క్‌లో ఈ దళం తన నివేదికను తయారు చేస్తుంది.

లావోస్ తిరుగుబాటుదారులకు ఉత్తర వియత్నాం సహాయం చేస్తున్నదన్న ఆరోపణలో నిజానిజాల పరిశీలనకు ఈ దళం నియమింపబడిన సంగతి పాఠకులకు విదితమే.

విమానాశ్రయంలో విలేఖరులు పరిశీలక దళం జరిపిన పరిశీలన గురించి ప్రశ్నించగా దళం అధ్యక్షుడు శ్రీ పినిచి షిబుసవా వ్యాఖ్యానించటానికి నిరాకరించారు.

కేరళ ఎన్నికలకై చురుకుగా ఏర్పాట్లు

కాలికట్, అక్టోబర్ 12

కేరళలో ఎన్నికల జాబితాలను పునః పరిశీలించే కార్యక్రమం చురుకుగా సాగుతున్నదని కేరళ గవర్నర్ సలహాదారు శ్రీ పి. వి. ఆర్. రావు నేడిక్కడ పత్రికా విలేఖరులకు వెల్లడించారు. అనుకున్న విధంగా కార్యక్రమం సాగిపోతున్నదనీ, నవంబర్ నెలాఖరుకు-ఎన్నికల కాలానికి చాలా ముందుగానే-పూర్తి కాగలదనీ ఆయన అన్నారు.

ఎన్నికల తేదీలను ఎన్నికల కమీషన్ వారు, కేంద్ర ప్రభుత్వమూ నిర్ణయించవలసి ఉంటుందని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను ప్రస్తావించి మలబారు ప్రాంతం చాలా ప్రశాంతంగా ఉందని శ్రీ రావు వివరించారు.

భూమివైపుకు రష్యన్ రాకెట్ ప్రయాణం

మాస్కో, అక్టోబర్ 12

చంద్రమండలానికి రష్యా ప్రయోగించిన రాకెట్ అనుకున్నవిధంగా భూమివైపుకు తిరిగి ప్రయాణం ప్రారంభించిందనీ, దీని వేగం క్రమంగా హెచ్చుతున్నదనీ రష్యన్ వార్తాసంస్థ టాస్ ప్రకటించింది. దానిలో పరికరాలన్నీ సక్రమంగా పని చేస్తున్నాయని కూడా తెలుస్తున్నది.

దక్షిణాఫ్రికా మంత్రికి ఘనా ఆహ్వానం

న్యూయార్క్, అక్టోబర్ 13

ఘనాను సందర్శించ వలసిందిగా ఘనా ప్రధాని క్వామీ న్క్రుమా, దక్షిణాఫ్రికా విదేశాంగ మంత్రి ఎరిక్‌లోను ఆహ్వానించినట్లు, వచ్చే సంవత్సరం ఘనాను సందర్శించడానికి ఎరిక్‌లో అంగీకరించినట్లూ విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తున్నది.

కొచ్చిన్ తాలూకాలో కమ్యూనిస్టులకు, ఇతరులకు మధ్య కొట్లాటలు

శాంతికి భంగం కలగ కుండా పోలీసు బందోబస్తు

ఎర్నాకులం, అక్టోబర్ 13

కొచ్చిన్ తాలూకాలోని కుంబలంగీ ద్వీపంలో కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టేతరులకు జరిగిన ఘర్షణలను పురస్కరించుకొని ఆ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడడానికి ప్రభుత్వం సాయుధ పోలీసుల గస్తీని ఏర్పాటు చేసింది.

గత మూడు రోజుల నుంచి ఇరు వర్గాల మధ్య పదురు చెదురుగా ఘర్షణలు జరిగినట్టు తెలుస్తున్నది

కేరళ విమోచనోద్యమం జరిగిన నాటినుంచి రెండు వర్గాలకూ రాజకీయ వైషమ్యాలు పొడచూపాయనీ, దీని ఫలితంగా గత ఆదివారం కొట్లాటలు జరిగి 5 మంది గాయపడ్డారనీ తెలుస్తున్నది. గాయపడినవారిని చికిత్సకై ఆస్పత్రిలో చేర్చారు.

జిల్లా కలెక్టర్ శ్రీ వార్కీ నేడు పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణకు తగు చర్యలు తీసుకోబడ్డాయని అన్నారు. పార్లమెంటు కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ పి. కె. కొడయన్ ఆ ప్రాంతంలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉందనీ, రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని శాంతి భద్రతలకు భంగం కలిగించిన వారిని శిక్షించాలనీ కోరారు.

ఆయుర్వేదౌషధములు.
శాస్త్రీయముగాను, నమ్మకముగాను తయారుచేయు సంస్థ.
వేంకటేశ్వర ఆయుర్వేదనిలయం.
చింతలూరు.
ఆలమూరు పోస్టు ★ తూర్పుగోదావరిజిల్లా.
ఆంధ్రదేశమందంతటను బ్రాంచీలు. ఏజన్సీలు కలవు.
హైద్రాబాద్ బ్రాంచ్: 712, సెంట్రల్ బ్యాంక్ బిల్డింగ్స్, సికింద్రాబాద్ బ్రాంచ్: 7-2-148, హిస్సమ్‌గంజ్ రోడ్; పాత పోలీస్ స్టేషన్ ఎదుట.

విక్రమ సంవత్సరం
బుధవారం, అక్టోబర్ 14, 1959
ఆశ్వయుజ శుద్ధ త్రయోదశి
త్రయోదశి రా॥ 7-5
పూ॥ భా॥ రా॥ 8-10
వర్జ్యం లేదు.

ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు: 4950

బుధవారం, అక్టోబర్ 14, 1959

స్వతంత్ర పార్టీ

స్వతంత్ర పార్టీ విధానాన్ని అనుసరిస్తే దేశం మట్టికొట్టుకు పోవల్సిందే"

ప్రధాని శ్రీ నెహ్రూ నిన్నటి దినం విజయవాడ సభలో అన్న ఈ మాటల్లో నిలువెల్లా నిజం తప్ప అన్యథా సంకోచించటానికి అవకాశం ఇచ్చే విషయం మచ్చుకు కూడా లేదు. ఆంధ్ర ప్రదేశానికి సంబంధించినంత వరకు ఆచార్య రంగా గారి శిష్య పరమాణువుల్లో ఎవరు పూనుకొన్నా చాలు; ఆంధ్ర ప్రదేశాన్ని చీకటి యుగంలోకి లాక్కుపోవటానికి మూడు నిమిషాలు కూడా పట్టదు.

ఉదాహరణకు చెన్నారెడ్డి గారిని తీసుకుందాం. ఆంధ్ర ప్రదేశంలోని ముక్కోటి ఆంధ్రులు హాయిగా కలిసి మెలిసి నవ్య రాష్ట్రంలో నివసిస్తుంటే వేరే స్వతంత్రంగా ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో నివశించడం ఆయన ప్రత్యేకత. ఆంధ్రప్రదేశం అవతరించిన తర్వాత ఇప్పటికి ఆయన ఎన్ని అవతారాలు ధరించినదీ కేవలం మనుష్యులకే గాక ఆంధ్రదేశంలోని పశులన్నిటికీ కూడా తెలుసు. డెమోక్రటిక్ పార్టీని గంగలో దిగవిడిచి రంగా గారి పంచన హాయిగా స్వతంత్ర పార్టీలో జేరాలనుకుంటున్న తొలి రోజుల్లో, చెన్నారెడ్డి గారు తమాషాగా ఒకసారి తెలంగాణా నినాదాన్ని లేవనెత్తి, స్వతంత్ర పార్టీ లక్ష్యం ఏమిటో ఆంధ్ర ప్రజానీకానికి కాస్త రుచి చూపించారు. ప్రజలు ఊరుకోరుగానీ అవసరం వస్తే తిరిగి నిజాం రాజ్యం కావాలనటానికి కూడా చెన్నారెడ్డి గారు వెనుదీయరు. ఆంధ్ర ప్రదేశం అధోగతి పాలు కావటానికి ఇంతకు మించి మరేం కావాలి?

ఇక పెద్ద తరహా నాయకులను గూర్చి చెప్పాలంటే స్వతంత్ర పార్టీ వ్యవస్థాపకుల్లో ఎవరికి వారు కొమ్ములు తిరిగిన రాజకీయ పండితులే. ధర్మ ప్రవచనాలు పలకటంలో గాని, దేశాన్ని చూసి అరుపులు, పెడ బొబ్బలు పెట్టటంలో గాని ఒకరికి మరొకరు తీసిపోరు. కాకపోతే ఒక్కటే ఒక లోపం. వారి ఆలోచనలు పూర్తిగా వెనక్కి తిరిగి ఉంటాయి.

స్వతంత్ర భారతదేశం కష్టపడి ఒక అడుగు ముందుకు వేస్తే ఆచార్య రంగా గారికి అది ఎంత మాత్రం కిట్టదు. పేరుకు రైతు బాంధవుడే, కాని బాంధవ్యం మరో చోట.

ఇక రాజాజీ విషయం కేవలం ఒక పెద్ద అరణ్య కాండ. రాతి యుగాల నాటి బూజు పట్టిన భావాలను ఆరాధించటం తప్పించి కాంగ్రెస్ చేసే ఏ పనీ ఆయనకి గిట్టదు. సోషలిజం అంటే ఆయనకి ఒళ్ళు మంట; సహకార వ్యవసాయం అంటే నిలువెల్లా రోత. ప్రజల అభివృద్ధి, పంచవర్ష ప్రణాళికలు, వీటిలో ఏ విషయాన్ని గూర్చి మాట్లాడినా ఆయనకు చెప్పశక్యం కానంత రోషం. ఒక్కమాటలో చెప్పాలంటే రాజాజీ అభిప్రాయాల ప్రకారం భారతదేశం హాయిగా వెనక్కి వెళ్ళిపోవాలి. ప్రజలు, ప్రజాస్వామ్యం మొదలైనవన్నీ అంతరించి కోటీశ్వరులు, పెట్టుబడిదారులు రాజ్యం ఏలాలి.

ప్రధాని శ్రీ నెహ్రూ అన్నట్టు భారతదేశం అధోగతి పాలు కావటానికి ఇంతకంటే మరేం కావాలి?

కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు సిద్ధాంతాలను చేపట్టడంతో దేశంలో అంతవరకు చాటుగా, మాటుగా అణిగి ఉన్న అభివృద్ధి నిరోధ శక్తులన్నీ ఒక కూటమిగా ఏర్పడ్డాయి. రాజకీయంగా ఆశాభంగాలు పొందిన వారంతా ప్రజలకు వ్యతిరేకంగా ఈ కూటమికి నాయకత్వం వహించారు. కాంగ్రెస్ ను దుమ్మెత్తి పోయటం తాత్కాలిక ఘట్టం మాత్రమే. వారు సాధించదల్చుకున్న లక్ష్యాలు ముందు ముందు వేరే ఉన్నాయి.

పాకిస్తాన్‌లో పంచాయతీ ఎన్నికలు

అయూబ్‌ఖాన్ ప్రకటన

లాయల్పూరు, అక్టోబర్ 12

పాకిస్తాన్‌లో పంచాయతీ సంఘాలకు ఎన్నికలు ఈ సంవత్సరాంతానికి పూర్తి కాగలవనీ, తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు గ్రామప్రజలకు పూర్తి స్వతంత్రం ఉంటుందనీ పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ అయూబ్‌ఖాన్ నేడు వెల్లడించారు.

లాయల్పూరు లోని బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు ఎన్నుకొన్న పంచాయతీ సంఘాలకు గ్రామీణ ప్రాంతాలలో పరిపాలనాధికారాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించే అధికారాలు ఇవ్వబడగలవని ఆయన అన్నారు. ఈ ఎన్నికలలో అధికారుల నుంచి గాని, అనధికారుల నుంచి గాని ఎటువంటి లోక్యం ప్రభుత్వం సహించదని ఆయన అన్నారు.

కాల్వ నీటి వివాదం

భారతదేశానికి, పాకిస్తాన్‌కు మధ్య జరిగిన ఒడంబడిక వరంగా నిర్మించుకొనవలసిన కొత్త నిర్మాణాలకు 40 కోట్ల పౌండ్లు సహాయం చేయగలమని మిత్ర రాజ్యాలు వాగ్దానం చేశాయని కూడా ఆయన వెల్లడించారు. కాల్వనీటి వివాదం పరిష్కారం అయిపోతుందని చెప్పి, ఈ సందర్భంలో ప్రపంచ బ్యాంకు చేసిన సహాయాన్ని ఆయన అభినందించారు.

ప్రస్తుతం సింధునదీ ప్రాంతంలోని తూర్పు ఉపనదులు మూడు భారతదేశానికి, పాకిస్తాన్‌కు నీటి సరఫరా చేస్తున్నాయనీ, ప్రస్తుతం ఒడంబడిక ప్రకారం తూర్పు ఉపనదులు మూడూ భారతదేశానికి, పడమటి నదులు మూడూ పాకిస్తాన్‌కు నీటి సరఫరా చేస్తాయనీ, ఈ ఏర్పాట్లకు అవసరమైన ధన సహాయాన్ని అమెరికా, కెనడా, ఇంగ్లండ్‌లు చేస్తాయనీ ఆయన వెల్లడించారు.

దేశంలో నిరుడు జరిగిన ఉప ఎన్నికలు

రాష్ట్రాలవారీ వివరాలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 12

గత సంవత్సరంలో (1958-59) ఇండియాలో మొత్తం 61 స్థానాలకు ఉపయెన్నికలు జరిగాయి. వీటిలో ఆరు పార్లమెంటుకు, 55 వివిధ రాష్ట్రాల శాసన సభలకు జరిగాయి.

పార్లమెంటుఉపయెన్నికలు బీహార్, బొంబాయి, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో జరిగాయి. ఇక అసెంబ్లీ ఉపయెన్నికలు ఆంధ్ర ప్రదేశ్‌లో 5, అస్సాం 5, బీహార్ 6, బొంబాయి 9, కేరళ 1, మధ్య ప్రదేశ్ 4, మద్రాస్ 2, మైసూర్ 2, ఒరిస్సా 4, పంజాబ్ 2, రాజస్థాన్ 3, ఉత్తర ప్రదేశ్ 8, పశ్చిమ బెంగాల్ 4 స్థానాలకు జరిగాయి.

హైద్రాబాద్, అక్టోబర్ 12

నిజామాబాద్ బీడీమజ్దూర్ సంఘం అధ్యక్షుడుగా శ్రీ ఎస్. బి. గిరి ఎన్నికైనారు.

తృతీయ ప్రణాళికలో భారీ, కీలక పరిశ్రమలకు ప్రాధాన్యం

శ్రీ మనూభాయ్ షా వివరణ

బొంబాయి, అక్టోబర్ 13

తృతీయ ప్రణాళికలో భారీ, కీలక పరిశ్రమల స్థాపనకు ఇతోధిక ప్రోత్సాహం లభిస్తుందని పరిశ్రమల శాఖా మంత్రి శ్రీ మనూభాయ్ షా వెల్లడించారు. మహారాష్ట్ర వాణిజ్య సమితి 32వ వార్షికోత్సవ సందర్భంలో నేడిక్కడ ప్రసంగిస్తూ శ్రీ షా ఈ విషయాన్ని వెల్లడించారు.

ప్రథమ, ద్వితీయ ప్రణాళికలలో జరిగిన పనులవల్ల తృతీయ ప్రణాళికలో భారీ పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితి ఏర్పడిందని శ్రీ షా అన్నారు. భారీ పరిశ్రమలు, కీలక పరిశ్రమలు నెలకొన్నదాకా పారిశ్రామికాభివృద్ధిని మనం సాధించామని సంతృప్తి పడడానికి అవకాశం లేదని ఆయన అన్నారు.

3వ ప్రణాళిక చివర కాలానికి దేశంలో ముడి ఉక్కు ఉత్పత్తి కోటి టన్నులు ఉండగలదనీ, దేశంలో ఇనుము, ఉక్కు ఉత్పత్తి అధికంగా ఉందని కొందరు చేస్తున్న వాదం నిజం కాదనీ అన్నారు.

ఉక్కు కొరత వల్ల ద్వితీయ ప్రణాళికలో కొన్ని చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చిందని, ఉక్కు అవసరాలను తక్కువ అంచనా వెయ్యడం అనే తప్పును భారతదేశం ఎప్పుడూ చేయదని ఆయన అన్నారు.

ప్రాథమికఔషధ ఉత్పత్తిలో కూడా 3వ ప్రణాళిక చివరి కాలానికి భారతదేశం స్వయంసమృద్ధం కాగలదని ఆయన అన్నారు. తృతీయ ప్రణాళిక కాలంలో ఔషధాల ఉత్పత్తే కాక, శాస్త్ర పరికరాలు, ఇతర వైద్య పరికరాలు ఉత్పత్తి చేయడానికి కూడా తగు చర్యలు తీసుకొనబడగలవని ఆయన వివరించారు. 3వ ప్రణాళికలో భారీ పరిశ్రమలకు 350 కోట్ల రూపాయలు అవసరం కాగలవనీ, ప్రథమ, ద్వితీయ ప్రణాళికా కాలాలలో సాధించబడిన పారిశ్రామికాభివృద్ధి ఫలితంగా భారీ పరిశ్రమలకు కావలసిన యంత్రాలను 250కోట్లవిలువమేరకు దేశంలో ఉత్పత్తి చేయడం సాధ్యం కాగలదని ఆయన అంచనా వేశారు.

పశ్చిమ బెంగాల్‌లో వరదల తగ్గుదల

కలకత్తా, అక్టోబర్ 12

నాడియా జిల్లాలోని చూర్ణినది తప్ప పశ్చిమ బెంగాల్‌లోని అన్ని నదులలోను వరద మట్టం తగ్గడం ప్రారంభించినట్లు వివిధ జిల్లాల నుంచి వచ్చిన తాజా వార్తల వల్ల తెలుస్తున్నది.

బీర్భూం జిల్లాలోమళ్ళీ అధిక వర్షాల వల్ల ఆ ప్రాంతంలోని నదుల మట్టాలు పెరిగే ప్రమాదం ఉంది. ఈ జిల్లాలోని అజయ నదిలో ఈ నెల ప్రారంభం నుంచీ నీటి మట్టం ప్రమాద స్థాయిని మించి ఉండడం వల్ల నది కిరుప్రక్కల విశాలమైన ప్రాంతాలకు అధిక నష్టం కలిగింది.

నిన్నటి వరకు జరిగిన రక్షణ చర్యల వల్ల వరదలలో చిక్కుకున్న 2 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చడం జరిగిందని రాష్ట్ర ఆహార శాఖా మంత్రి శ్రీ పి. సి. సేన్ నేడు ప్రకటించారు. ఇప్పటి వరకు వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 28 అని కూడా ఆయన ధృవపరిచారు. అధికారుల నుంచి వచ్చిన వార్తలనుబట్టి కల్నా పట్టణంలో తూర్పుభాగమూ, నవీద్వీప పట్టణంలో అధికభాగం ఇంకా వరద నీటిలో మునిగి ఉన్నట్లు తెలుస్తున్నది.

పడవల ప్రమాదంలో 16 మంది దుర్మరణం

కలకత్తా, అక్టోబర్ 13

గత ఆదివారం నాడియా జిల్లాలాని క్రిష్ణఘర్ ప్రాంతంలో జలంగీ నదిలో 2 పడవలు మునిగి పోయిన ఫలితంగా 16 మంది మరణించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. 10 శవాలు బయటకు తియ్యబడ్డాయని, మరో ఆరుగురి జాడ ఇంకా తెలియ లేదని తెలుస్తున్నది.

అదే రోజున జనపనారను ఊరబెడుతుండగా నదిలో కొట్టుకు పోయిన ఒక కర్షకుని శవం కూడా కనుగొనబడింది. ఇళ్లుకూలడం వల్లమరో ఇద్దరు మరణించినట్లు మూర్షిదాబాద్ నుంచి వచ్చిన వార్తల వల్ల తెలుస్తున్నది.

హైద్రాబాద్, అక్టోబర్ 8

రాష్ట్ర తాటిబెల్లం సహకార సమాఖ్యలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా సహకార సంఘాల సంయుక్త రిజిస్ట్రారు (తాటి బెల్లం), పారిశ్రామిక, వాణిజ్య శాఖ సంయుక్త డైరెక్టరు ప్రభుత్వం చే నియమింపబడ్డారు. ఈ సమాఖ్య కార్యస్థానం పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో ఉంది.

అరబ్ రిపబ్లిక్‌కు చైనా లేఖ

తిప్పి పంపినట్టు కైరో పత్రిక ప్రకటన

కైరో, అక్టోబర్ 12

సిరియన్ కమ్యూనిస్టు నాయకుడు ఖలీద్ బాగ్దాష్ ఐక్య అరబ్ రిపబ్లిక్‌పై చేసిన ఆరోపణకు సంబంధించి, చైనా పంపిన సమాధానాన్ని అరబ్ రిపబ్లిక్ తిప్పికొట్టినది.

కైరో పత్రిక అల్ అహ్రామ్ పత్రిక పై వార్తను ప్రకటించినది. చైనా ప్రభుత్వం లేఖ చైనీస్ లిపిలో ఉన్నదనీ, అందులో ఒక పదానికి అనధికారికంగా పంపిన తర్జుమాలో సరియైన అర్థం గాక పోగా, రాజకీయ సంబంధాలకు అది అనువైన పదం కాదనీ పైపత్రిక ప్రకటించినది.

పైపదం లేకుండా మరొక లేఖను చైనా పంపించినదనీ, లేఖను అరబ్ రిపబ్లిక్ పరిశీలిస్తున్నదనీ అల్ అహ్రామ్ ప్రకటించినది.

చైనీస్ కమ్యూనిస్టు పరిపాలన పదవ. వార్షికోత్సవ సందర్భంలో జరిగిన ఒక ఉత్సవంలో సిరియన్ కమ్యూనిస్టు నాయకుడు అరబ్ రిపబ్లిక్‌ను గూర్చి దుర్భాష లాడినట్టు లోగడ అరబ్ రిపబ్లిక్ ఆరోపించినది.

రిండెర్ పెస్ట్ నిరోధక పథకం

హైద్రాబాద్, అక్టోబర్ 12

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో రిండెర్ పెస్ట్ నిరోధక పథకం క్రింద సెప్టెంబర్ నెలలో ఆధిక వర్షాల వల్ల తరచుగా పనికి అవరోధం ఏర్పడినప్పటికి బాగానే కృషి జరిగింది. 4, 5, 7, 8వ ప్రత్యేక జట్టులు ఆదిలాబాదు జిల్లాలో తమ పని పూర్తి చేసుకున్న తరువాత కరీంనగరం జిల్లాకు తరలి వెళ్ళినవి. రిండెర్ పెస్ట్ నిరోధక పథకం క్రింద పనిచేస్తున్న ప్రత్యేక జట్టులు 1,57,920 పశువులకు టీకాలు వేసినవి. వీటితో కలుపుకొని ఇప్పటివరకుటీకాలు వేసిన పశువుల సంఖ్య 10, 81, 542 వరకు పెరిగింది. కరీంనగరం జిల్లాలోనికరీంనగరం, హుజూరాబాదు, జగిత్యాల, మెట్పల్లి, తాలూకాలలోనూ, ఆదిలాబాదు జిల్లాలోని లక్సెట్టిపేట తాలూకాలోను ఈ నెలలో పని జరిగింది.

నాంపల్లిలో 'హైకో' పత్ర విక్రయశాల

హైద్రాబాద్, అక్టోబర్ 13

ఈ నెల 11వ తేదీన నాంపల్లిలో నూతనంగా హైద్రాబాద్ కేంద్ర చేనేత సహకార సంఘం వారి విక్రయ శాలను ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ ఉపాధ్యక్షులు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంలో లక్షలాది నేత పనివారికి ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమ ప్రాముఖ్యాన్ని ఆయన వివరించారు. బీద వారైన చేనేత వారికి సహాయం చేయడానికి చేనేత వస్త్రాలను విరివిగా కొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అఖిల భారత చేనేత సంఘం అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయడం వల్ల చేనేత వస్త్రాల నాణ్యం, మన్నిక అభివృద్ధి చెందాయి.

జనగామ వడ్రంగి పారిశ్రామిక సహకార సంఘం

జనగామ, అక్టోబర్ 8

జనగామ వడ్రంగి పారిశ్రామిక సహకార సంఘం 5వ వార్షిక సమావేశం జరుపబడింది. కార్యనిర్వాహకులుగా ఈ క్రింది వారిని యెన్నుకోవడం జరిగినది:

అధ్యక్షులు: రాగి వర్సింహులు. ఉపాధ్యక్షులు: బత్తోజు రామయ్య. కార్యదర్శి: సంబోజు యాదగిరి, కోశాధ్యక్షులు: లగిశెట్ట చెంద్రయ్య, కార్యవర్గసభ్యులు: హర్కారె వెంకట శ్రీనివాసరావు, దనాల కోట ఈశ్వరయ్య, సంబోజు రామయ్య, బత్తోజు కొండయ్య, సంచాలపురం రాములు.

గజిబిజి రాతలో సిద్ధహస్తులు

లండన్, అక్టోబర్ 12

గజిబిజి రాత రాయటంలో డాక్టర్లు, వ్యాపారస్తులు- ప్రత్యేకించి బాగా పైకి వచ్చిన వాళ్లు- అందరికంటె మొనగాళ్ళని బ్రిటన్‌లోని ఒక పన్నుల కంపెనీ తెలుపుతున్నది.

తర్వాత స్థానం వకీళ్ళు, లాయర్లు, శాస్త్రజ్ఞులు, పాత్రికేయులు, దుకాణదార్లు, గాయకులు. మంచి దస్తూరీ రాసే వాళ్ళు: ఎకౌంటెంట్లు, వాస్తుశిల్పులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గుమాస్తాలు, రచయితలు, వాణిజ్య చిత్రకారులు, బిషప్పులు, లైబ్రేరియన్లు, పురాతత్వశాస్త్రజ్ఞులు.

దేశ వ్యాప్తంగా సర్వే జరిపి పైకంపెనీ ఈ వివరాలు ప్రకటించినది.

రోదసీయానంలో భోజనం చేసే పద్ధతి

మాస్కో, అక్టోబర్ 12

మానవుడు రోదసీయానం చేసే సందర్భంలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడానికి సోవియట్ దేశంలోని వైజ్ఞానిక పరిశోధనాసంస్థలన్నీ కృషి చేస్తున్నాయని "మెడికల్ వర్కర్" అనే మాస్కో పత్రిక వ్రాస్తున్నది. రోదసీ యాత్రికులు యెలా భోజనం చేయాలన్నది అలాంటి సమస్యల్లో ఒకటి. ఈ విషయంలో జరుగుతున్న పరిశోధనలను గురించి ప్రఖ్యాత వైద్యవిజ్ఞాన శాస్త్రజ్ఞుడు జి. అరుత్యునోవ్ యీ పత్రికా విలేఖరికి తెలియజేసారు.

మామూలుగా భోజనంచేసే పద్ధతికీ, రోదసీయాన సమయంలో భోజనం చేయవలసిన పద్ధతికీ తేడా ఉంటుంది. రోదసీయానంలో ఆహారాన్ని తరుచు- మూడు నాలుగు గంటలకొక పర్యాయం - తక్కువ పరిమాణంలో తీసుకోవాలి.

స్వయం చలనక పద్ధతిని రోదసీ యాత్రికులకు ఆహారాన్ని తినిపించే యంత్రాలను విజ్ఞాన శాస్త్రవేత్తలు తయారు చేస్తున్నారు.

భూమికి తిరిగి వచ్చే సమస్య

చంద్రమండలం చుట్టూ పరిభ్రమించి రాకెట్ భూమండల సమీపానికి తిరిగి రావడం, రోదసీయాత్ర చేసి భూమికి తిరిగి రావడం సమస్యా పరిష్కారంలో మొదటిమెట్టని సోవియట్ దేశ విజ్ఞాన శాస్త్ర పరిషత్తు కరస్పాండెంగ్ సభ్యుడు, మిత్రోఫాన్ జ్వెరేవ్ అంటున్నారు. చంద్ర మండలం చుట్టూ రాకెట్ తిరిగి రావడంవల్ల, ఇంతవరకూ మనకు తెలియనటువంటి చంద్రమండలపు ఆవలివైపు విషయాలకు సంబంధించిన సమాచారం లభిస్తుంది.

సూర్య మండలం, లేదా ఇతర అంతరిక్ష గోళాల గురుత్వాకర్షణ శక్తి వినియోగింపబడినప్పుడు లభించే స్వేచ్ఛా గమనం, అనగా జడత్వ ధర్మాన్నను సరించి (ఇనెర్షియా) లభించే గమనం రోదసీ యానాలకోసం వినియోగింపబడుతుంది. రాకెట్‌ను యెగుర వేయడానికీ, దానిని కక్ష్యలో ప్రవేశ పెట్టడానికి మాత్రమే ఇంధనం వినియోగపడుతుంది.

అంతరిక్ష గోళాల కదలిక, పరిభ్రమణల విషయాలను గురించి పరిశోధనలను జరిపే విజ్ఞాన శాస్త్ర వేత్తలకు గూడా యీ రాకెట్ అందజేస్తున్న సమాచారం ఆసక్తిదాయకంగా ఉంటుంది. భూమండలానికి 5-10 వేల కిలోమీటర్ల దూరంలో నీచ స్థాయి ఉండేటటువంటి కృత్రిమ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశ పెట్టడం కూడా ఆసక్తిదాయకంగా ఉంటుంది. అటువంటి కృత్రిమ ఉపగ్రహం కొన్ని వేల సంవత్సరాలవరకూ రోదసీలో ఉంటుంది. అది అనేక విషయాలను గురించి కచ్చితమైన సమాచారాన్ని అందజేయగలుగుతుంది.

అంతరిక్ష యాత్రికులు రెండుసార్లు వాహనాలు మారాలని సోవియట్ శాస్త్రజ్ఞుని జోస్యం

మాస్కో, అక్టోబర్ 12

అంతరిక్ష యాత్రికులు లక్ష్యాన్ని చేరటానికి గాను రెండు సార్లు వాహనాలను మార్చుకోవలసి ఉంటుందని సోవియట్ నక్షత్ర శాస్త్రజ్ఞుడు స్టెరన్‌ఫీల్డ్ జోస్యం చెప్పారు.

సోవియట్ వార్తా సంస్థ టాస్ విలేఖరికి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన పై విషయం తెలియ జేసారు.

భూమి మీది నుంచి ఒక చిన్న రాకెట్‌లో బైల్దేరిన తర్వాత అంతరిక్ష యాత్రికులు ఒక పెద్ద అంతర గ్రహ స్థావరాన్ని చేరవలసి ఉంటుందనీ, తర్వాత స్థావరం నుంచి మరో చిన్న రాకెట్‌తో లక్ష్యాన్ని చేరవలసి ఉంటుందనీ ఆయన తెలియ జేసారు.

అంతర్ గ్రహ స్థావరం, ఇటీవల చంద్ర మండలానికి ప్రయోగించినటువంటిదే అయినా, అంతకంటే చాలా పెద్దదిగా ఉండాలని ఆయన తెలియ జేసారు. పైన పేర్కొన్న అంతర్ గ్రహ స్థావరం అంతరిక్షంలో ప్రయాణించేటప్పుడు మట్టుకు భూమి పరిసర ప్రాంతాలలో ఉండగలదని ఆయన తెలిపారు.

కృత్రిమంగా నిర్మించబడే అంతరిక్ష స్థావరాలు ఇతర గ్రహాలకు వెళ్ళే మెట్ల మాదిరిగా ఉంటాయని శ్రీ స్టెరన్ ఫీల్డ్ అన్నట్టు "టాస్" ప్రకటించినది.

సక్రమంగా కక్ష్యను నిర్ణయించగలిగితే పైకి అంతర్ గ్రహ స్థావరం, చంద్రుడు వివిధ కళలలో ఉన్నప్పుడు 13 లేక 14 సార్లు మండల సమీపానికి వెళ్ళగలదని శ్రీ స్టెరన్ ఫీల్డ్ ప్రకటించారు.

డాక్టర్ అవండి!

మీరు ఇంటివద్ద కూర్చునే పోస్టల్ ట్యూషన్ ద్వారా ప్రభుత్వంచే రిజిస్టరు కాబడిన కాలేజీనుంచి డిప్లొమా ను పొందవచ్చును. ఉచిత ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి.

INDIAN INSTITUTE OF HOMEOPATHY
(H-23) Goal Bagh, Amritsar.

ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారక మండలి

నూతన కార్యవర్గ సమావేశం

సూర్యాపేట, అక్టోబర్ 12

దక్షిణ భారత హిందీ ప్రచార సభ-ఆంధ్ర, విజయవాడ కార్యాలయ భవనమునందు మొన్న 8వ తేదీన శ్రీ చావలి కోటేశ్వరరావుగారి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ హిందీ ప్రచారక మండలి నూతన కార్యవర్గ ప్రథమ సమావేశము జరిగినది. ఈ సమావేశమునందు హైస్కూళ్ళలోను, మిడిల్ స్కూళ్ళలోను హిందీ పండితులుగా పని చేయుచున్న వారికి, తెలుగు పండితులకు వలె సంస్కృత పరీక్షలో ఉత్తీర్ణులై యున్న, మూడు అడ్వాన్సు ఇంక్రిమెంటులు యివ్వ వలసినదిగా ప్రభుత్వమును కోరినారు. తెలంగాణా ప్రాంతమునందు హైస్కూళ్ళు, మిడిల్ స్కూళ్ళయందు క్వాలిఫైడ్ హిందీ పండితులను నియమించు ఏర్పాటు చెయ్య వలసిందిగా ప్రభుత్వమును కోరనైనది. తెలంగాణాలో హిందీ ప్రేమీ మండలులను, హిందీ ప్రచారక మండులులను నెలకొల్పి హిందీ ప్రచారమును వృద్ధి చేయుటకు గాను హిందీ అర్థశైక్షణ్లను నియమించ వలసినదిగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ-మద్రాసును కోరనైనది. నవంబర్ 30 వ తేదీలోగా దక్షిణ భారత హిందీ ప్రచార సభ-ఆంధ్రకు ప్రతినిధులను ఎన్నుకొని తెలియ జెయ్య వలసినదిగా జిల్లా ప్రచారక మండలులను కోరనైనది.

ఈ సమావేశమునకు కార్యవర్గ సభ్యులు సర్వశ్రీ వి. వీర్రాజు, చెరుకూరు వెంకటేశ్వర్లు, సయ్యద్ అన్వరుల్లా, ఎల్. బలరామిరెడ్డి, మాలెంపాటి ధర్మారావు, దివి వెంకటనరసింహాచార్యులు, శ్రీమతి డి. సావిత్రి, యలమంచి లక్ష్మయ్యగారలు హాజరయినారు.

ప్రధాన కార్యదర్శి శ్రీ గుంటుపల్లి రాజగోపాలంగారు వందన సమర్పణ చేశారు.

ముషీరాబాద్‌లోని కేసరి యువజన సంఘంవారు విజయదశమి సందర్భంలో ఈ నెల 10వ తేదీన 'మందారాలు' అనే పిల్లల నాటికను పిల్లలచే ప్రదర్శింపజేశారు. కుమారి జి. భారతి బాయ్ నృత్య ప్రదర్శనానంతరం కార్యక్రమాలలో పాల్గొన్నవారిని కార్యదర్శి ప్రేక్షకులకు పరిచయం చేశాక జాతీయ గీతగానంతో కార్యక్రమం ముగిసింది

చంద్ర మండల విశేషాలు-3

భూమి ఎలా పుట్టినదీ అన్న విషయమే ఇంకా తెగని సమస్యగా ఉంది. ఈ విషయంలో అనేక సిద్ధాంతాలు ప్రతిపాదించబడినా ఏ సిద్ధాంతమూ స్పష్టమైన సమాధానాన్ని ఇవ్వలేక పోయినది. భూమి పుట్టుక గురించిన సిద్ధాంతాలలో ఎన్ని వైవిధ్యాలు ఉన్నా, సూర్యుడినుంచో, సూర్యుడితో సంబంధం ఉన్న మరో నక్షత్రం నుంచో, లేక సూర్యుని చుట్టూ ఆవరించి ఉన్న వాయు మేఘం నుంచో భూమి పుట్టి ఉంటుందని భావించడానికి ఆస్కారం ఉంది.

ఇదే విధంగా చంద్రుని ఉత్పత్తిని గురించి కూడా అనేక సిద్ధాంతాలు ప్రతిపాదించ బడ్డాయి. ఒకప్పుడు సూర్యగోళంచుట్టూ పల్చటి వాయుమేఘాలు ఉండేవనీ, ఆవాయుమేఘాలు సంకోచంపొంది వలయాలుగా విడిపోయాయనీ, ఆవలయాలన్నీ వాయు పూరితమైన గ్రహాలుగా ఘనీభవించాయనీ ఒక సిద్ధాంతం. ఈ కొత్తగా తయారయిన గ్రహాలలో భూమి ఒకటనీ, భూమిలోన గురుత్వాకర్షణ కేంద్రదిశలో సంకోచించుకొని, తాను స్వయంగా మరో వాయువలయాన్ని బహిర్గతం చేసిందనీ, ఆ నూతన వాయువలయం ఘనీభవించి చంద్రునిగా రూపొందిందనీ ఈ సిద్ధాంతం చెపుతోంది కాని ఈసిద్ధాంతానికి ఇప్పుడు ఆమోదం లభించడం లేదు.

మొదట్లో చంద్రుడూ, భూమీ ఒకటేననీ, సూర్యుని ఆకర్షణ శక్తివలన భూమిపై కలిగిన కెరటాలవల్ల కొంత ద్రవ పదార్థం భూమి నుంచి విడిపోయి చంద్రునిగా రూపొందిందనీ మరో సిద్ధాంతం.

చంద్రుని ఉత్పత్తికి సంబంధించి మరో సిద్ధాంతం కూడా ఉంది. చంద్రుడు భూమికి ఉపగ్రహం కాదనీ, భూమి ఉత్పత్తి అయినట్టే చంద్ర గ్రహం కూడా ప్రత్యేక గోళంగా రూపొందినదనీ, భూమి ఆకర్షణ శక్తి అధికంగా ఉండడం వల్ల తన పరిధిలోకి భూమి ఆకర్షించిందని ఈ సిద్ధాంత సారాంశం. భూమి, చంద్రుడు రెండు వేర్వేరు గ్రహాలని వివరించే ఈ సిద్ధాంతాన్ని చాలా మంది ఆమోదించారు. పూర్వం విశ్వసించినట్లు భూమి నుంచి విడిపోయిన పదార్థంగా చంద్రుణ్ణి పరిగణించడం చాలా అసంభవంగా కనిపిస్తోంది.

భూమి, చంద్ర మండలం వాటి పరస్పరాకర్షణ శక్తి వల్ల పరిభ్రమణ మార్గాలను సరిదిద్దుకోగల్గుతున్నాయి. ఈ శక్తి కారణానే చంద్రుడు తన కక్ష్యలో తిరగ టానికి పట్టే కాలం, తన చుట్టూ తిరగ టానికి పట్టే కాలం ఒకటే ఉండే లాగ చంద్రుని పరిభ్రమణ వేగం తగ్గింది. చంద్ర మండలం ఆకర్షణ శక్తి ప్రభావం వల్ల భూమి పరిభ్రమణ వేగం తగ్గి క్రమంగా పగలు పెద్దదవుతూ ఉన్నది.

చంద్ర మండలం నుంచి చూస్తే సూర్యుడు 15 రోజులకు పైగా క్షితిజ రేఖకు పైనే ఉన్నట్టు కనిపిస్తుంది. చంద్రుని మీద ఉదయపు కాలం మన వారం అంత దీర్ఘంగా ఉంటుంది! చంద్రుని మీద ఒక దినం మన నెలకు (27 1/3 రోజులకు) సమంగా ఉంటుంది. భూమి చుట్టూ చంద్రుడు తిరగటం వలే మనం నెలలను గణించ డానికి ఆధారం ఏర్పడుతున్నది.

ప్రస్తుతం మనిషి రోదసీయుగ ప్రాంగణంలో ఉన్నాడు. మన రోదసీ యాత్రలకు ప్రథమ లక్ష్యం చంద్రుడు. ఈ యాత్రలకు భూమికి ఉన్న గురుత్వాకర్షణ శక్తే ప్రధానావరోధంగా ఉంది. సెకనుకు 7 మైళ్ళ వేగంతో ప్రయాణిస్తే కాని మనం ఈ ఆకర్షణ శక్తిని అధిగమించి రోదసిలోనికి ప్రయాణించలేము. వినూనాలు, గాలి గుమ్మటాలు గాలి మీద ఆధారపడి నడుస్తాయి. రోదసిలో గాలి లేదు కనుక రోదసీ ప్రయాణాలకి ఈ సాధనాలు ఉపకరించవు. అందువేతనే ఏ విమానం కూడా భూమి నుంచి కొద్ది మైళ్ళ కంటే ఎక్కువ ఎత్తుకు పోలేదు. రాకెట్ గమనానికి గాలి లేక పోయినా అవరోధం కలగదు అందు వల్లే మన రోదసీ ప్రయాణపు ఆశలన్నీ రాకెట్ మోటారుపైనే ఆధారపడి ఉన్నాయి.

— శ్రీ వి. బి. రాజు.

3వ దిగ్విజయ వారం!

టిప్పు సుల్త

7 వ సంయుక్త వారం!
చందమామ ఫిలిమ్స్ వారి
సిపాయి కూతురు
(తెలుగు)
జమున, సూర్యకాంతం, రమణారెడ్డి, గుమ్మడి, బాలకృష్ణ
దర్శకత్వం: పి. చంగయ్య, బి. ఏ. సంగీతం: ఎమ్. ఎస్. రాజు
రీగల్ హైద్రాబాద్
(Nima) — పూర్ణా రిలీజ్ —

విజయవంతమైన 12 వ సంయుక్త వారం!
రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి
శభాష్ రాముడు
ఎస్. టి. రామారావు, గిరిజ, గుమ్మడి, రమణమూర్తి,
కాంతారావు, మాలిని, రేలంగి
సాగర్ హైదరాబాద్ అలంకార్ సికిందరాబాద్
అటల సమయాలు: 6-00, 9-30
మార్కండేయ వరంగల్
(Nima) - రాజశ్రీ రిలీజ్ -

సికిందరాబాద్, హైదరాబాద్‌లలో వ్యాపార, నివాసాలకు
తగిన ఆస్తుల గొప్ప వేలం అమ్మకం
దిగువ తెలిపిన ఆస్తులు అక్కడికక్కడే వేలం వేయబడును.
1. హిమాయత్‌నగర్‌లో "తఖ్ జంషీద్" సమీపంలో 3-6-394 నెంబరు గల అధునాతన డిజైనులో గల బంగళా. ఆధునిక సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయబడి ఉన్నవి. నెలకు రు. 305/- అద్దెవస్తుంది. ఒక భాగం పొసెషన్‌తో 18-10-59 న ఉదయం 11 గంటలకు.
2. సైఫాబాద్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం ఎదుట శాంక్షన్ పొందబడి, 11, 16 నెంబరుతో 437, 404 చ. గ. వైశాల్యం గల 2 ప్లాట్లు 25-10-59 న ఉ. 11-00 గంటలకు.
3. సికిందరాబాద్‌లో, పార్క్‌లేన్‌లో, ఫ్యాషన్స్ షోరూముకు ఆనుకొని, దగ్గిర దగ్గిర 807, 477, 474, 171 చ. గ. వైశాల్యం గల విడి విడి ప్లాట్లలో ఒక విశాలమైన బంగళా 1-11-59న పగలు 11 గంటలకు. భవనం ఒక్కటికి రు. 800/- అద్దె వస్తోంది.
4. యూసఫ్ గూడాలో (అమీర్‌పేట) సారథి స్టూడియో వద్ద 3 ఎకరాల భూమి, ఒక పెద్ద గోడౌనులతో నవీన డిజైనులో నిర్మించబడిన 3 బంగళాలు 8-11-59న ఉదయం 11 గంటలకు వేలం వేయబడును. పాలకేంద్రం, తోళ్ళ పెంపకానికి, ఫిలిం స్టూడియో నిర్మాణానికి వీలైనది.
ఇతర వివరాలకు, తనిఖీ చేసుకోడానికి:
మోడరన్ గవర్నమెంట్ అండ్ పబ్లిక్ ఆక్షనర్స్
మాలకుంట రోడ్, మొజంజాహి మార్కెట్ వద్ద,
హైదరాబాద్ (ఫోన్ : 5837).

ముద్రణ * ప్యాకింగ్
లేఖనము * ర్యాపింగులకు
సిర్పూరు కాగితమును
ఉపయోగించండి
*
ఆర్ట్ పేపర్, క్రోమోబోర్డ్‌లతో సహా
అన్ని రకములైన కాగితములను
తయారు చేయువారు
క్రీమ్‌లెయిడ్, కలర్ ప్రింటింగ్
మా ప్రత్యేకత
*
ది సిర్పూర్ పేపర్ మిల్స్
లిమిటెడ్
సిర్పూర్-కాగజ్‌నగర్, సెంట్రల్ రైల్వే.

ఆస్థాన కవి 94వ జన్మదినోత్సవం అక్టోబర్ 22, 23, 24 తేదీలలో

రాజమహేంద్రవరం, అక్టోబర్ 8

కవి సార్వభౌమ, మహా మహోపాధ్యాయ, ఆంధ్ర ప్రదేశ్ ఆస్థాన కవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి 94వ జన్మదినోత్సవం అక్టోబర్ 22, 23, 24 తేదీలలో మున్సిపల్ మ్యూజియం హాలులో వైభవోపేతంగా జరుపబడుతుంది.

ఇందుకుగాను ఏలేశ్వరం పుర ప్రముఖులు శ్రీ అలమండ నూకరాజుగారు అధ్యక్షులుగా, ఏలేశ్వరం లోక సేవాసమితి కార్యదర్శి శ్రీ హెచ్. ఆర్. హిశాత్థి గారు కార్యదర్శిగా ఒక ఆహ్వాన సంఘం నియమించబడింది.

ఈ ఉత్సవ కార్యక్రమాలకు దేశంలోని వివిధ రంగాలలో అశేషకీర్తిని ఆర్జించిన ప్రముఖులను ఆహ్వానించడానికి నిశ్చయించారు.

1937 ఫిబ్రవరి నెలలో బ్రిటిష్ గవర్నర్ జనరల్ చేతను; 1958 అక్టోబర్‌లో ఇండియన్ రిపబ్లిక్ ప్రెసిడెంట్ చేతను ఘనంగా సన్మానించబడిన తరువాత జరుపబడుతున్న ఈ జన్మదినోత్సవ సందర్భంగా, అక్టోబర్ 22వ తేదీన "శ్రీ కృష్ణస్వీయ చరిత్రము" అనే తమ ఆత్మకథను, శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు తమ తల్లి దండ్రులకు అంకితం చేయలోతున్నారు. ఇదే సభలో ఇతర కవులచే శ్రీ శాస్త్రిగారికి రెండు కావ్యాలు అంకితం చేయబడుతున్నాయి.

* * *

సాహిత్య, ఆశుకవితా పరీక్షల నిర్వహణ

కవి సార్వభౌమ, ఆస్థానకవి శ్రీ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి 94వ జన్మదినోత్సవం సందర్భంగా అక్టోబర్ 23వ తేదీ శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకు, సాహిత్య, ఆశుకవిత్వ పరీక్షలు జరిపి, అందు ఉత్తీర్ణులైన మొదటి తరగతి వారికి-రు15-లు, రెండవ తరగతి వారికి రు10 లు యోగ్యతా పత్రముల తోపాటు బహూకరిస్తారు.

సాహిత్య, ఆశుకవిత్వములకు ప్రత్యేక పరీక్షా పత్రములు ఇవ్వబడతాయి. ఈ పరీక్షలందు 20-25 సంవత్సరాలలోపు వయస్సుగల వివిధ పాఠశాలలకు, కళాశాలలకు చెందిన విద్యార్థి, విద్యార్థినులు పాల్గొనవచ్చును.

కాకుండా పై పరీక్షలకు హాజరు కాదలచిన [illegible] తమ పేరు నమోదు చేసుకోవలసి ఉంటుంది. అక్టోబర్ 20వ తేదీన చేరేలాగున "మధుర కవి శ్రీ చేబోలు చిన్నయ బ్రహ్మమ్ గారు, కవితా పరీక్షా విభాగ కార్యదర్శి, ఆస్థాన కవి జన్మదినోత్సవ సంఘం-లక్ష్మీవారపుపేట- రాజమండ్రి" అనే చిరునామాకు పంపించవలసినదిగా కోరుతున్నారు.

గృహనిర్మాణ పథకాలకు కోటి రూపాయలు

హైద్రాబాద్, అక్టోబర్ 12

వచ్చే ఆర్థిక సంవత్సరంలో సహకార గృహ నిర్మాణ పథకాలకు కోటి రుపాయల కేటాయింపు జరగగలదని తెలుస్తోంది. ఈ ఏడు తెలంగాణాకు 20 లక్షలు, ఆంధ్రకు 20 లక్షలు కేటాయించారు. ఇంకా అదనంగా పది లక్షలు కావలసి వుంటుందని సహకార శాఖ వారు ప్రభుత్వాన్ని కోరారు. పబ్లిక్ వర్క్స్ శాఖ వారు ఈ యేడు మిగిలి పోయ్యే పది లక్షల రూపాయలు గృహ నిర్మాణ పథకాల పరంగా వదులుకుంటారని తెలుస్తోంది.

మంత్రుల పర్యటనలు

హైద్రాబాద్, అక్టోబర్ 12

కార్మిక, స్థానిక పరిపాలన శాఖా మంత్రి శ్రీ డి. సంజీవయ్య నేడు ఉదయం హైద్రాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరి వెళ్ళారు. ఆయన రేపు సాయంత్రం విజయవాడలో బయలుదేరి సూర్యాపేట వెడతారు. 14 వ తేదీ ఉదయం 9 గంటలకు నల్లగొండ చేరుకుంటారు. అదే రోజు రాత్రి మిర్యాలగూడెం మార్గంగా హైద్రాబాద్ తిరిగి చేరుకుంటారు. 18 వ తేదీ ఉదయం హైద్రాబాద్‌లో కారులో బయలుదేరి భువనగిరి వెడతారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు దేవరకొండకు వెళ్ళి అదే రాత్రి హైద్రాబాద్‌కు తిరిగి వస్తారు.

* * *

రెవెన్యూ శాఖా మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి అక్టోబర్ 13 వ తేదీ మధ్యాహ్నం 2-05 గంటలకు విమానంలో ఢిల్లీకి బయలుదేరుతారు. అక్టోబర్ 18వ తేదీ మధ్యాహ్నం హైద్రాబాద్‌కు తిరిగి వస్తారు.

* * *

పబ్లిక్ వర్క్స్ శాఖామంత్రి శ్రీ జె. వి. నరసింగరావు ఈ నెల 14 వ నేదీ మధ్యాహ్నం విమానంలో బొంబాయికి బయలు దేరుతారు. అచ్చటి నుంచి పూనా పట్టణానికి వెళ్లి 18 వ తేదీ ఉదయం హైద్రాబాద్‌కు తిరిగి వస్తారు.

వ్యవసాయ విద్య

అణ్ణామలై విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ సూచనలు

అణ్ణామలై నగర్, అక్టోబర్ 12

అమెరికన్ లాండ్ గ్రాంట్ కళాశాలల మాదిరి సంస్థలను స్థాపించినట్లయితే ఈ దేశంలో వ్యవసాయ విద్యకు ఎంతో ప్రయోజనం సమకూరుతుందని అణ్ణామలై విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు శ్రీ టి. ఎం. నారాయణ స్వామి పిళ్ళై గత వారం ఇక్కడ ఒక సమావేశంలో నక్కాడించారు. ఈ సమావేశానికి దక్షిణ భారత దేశంలోని ప్రముఖ వ్యవసాయ విద్యావేత్తలు హాజరైనారు.

ప్రపంచంలో ఎక్కడా లేని సమగ్ర శాస్త్రీయ, సాంకేతిక ప్రయోగ విద్యా విధానం ఈ లాండ్ గ్రాంట్ కాలేజీలలో అమలు జరుగుతున్నదని ఆయన చెప్పారు.

అమెరికాలో వ్యవసాయ విద్యా బోధన యావత్తు ఈ కళాశాలలకే ఒప్పగించబడిందని పేర్కొంటూ శ్రీ పిళ్ళై ఇండియాలో సాంకేతిక సహకార సంస్థతో డ్యాటుతో ఈ దేశంలో కూడా ఇటువంటి కళాశాలలను నెలకొల్ప వచ్చును అన్నారు.

మద్రాసు, మైసూర్, కేరళ రాష్ట్రాలలో టి. సి. ఎం. అమలు జరుపుతున్న అంతర్విశ్వ విద్యాలయ కార్యక్రమాల అభివృద్ధి చర్చించటానికి గత వారంలో ఏర్పాటైన రెండు రోజుల సమావేశాన్ని ప్రారంభిస్తూ శ్రీ నారాయణ స్వామి పిళ్ళై పై విధంగా ఉపన్యసించారు. ఈ కార్యక్రమం క్రింద పెన్సీ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ల బృందం ఒకటి ఈ మూడు రాష్ట్రాలలోని వ్యవసాయ కళాశాలలకు సహాయ పడుతున్నది.

సెప్టెంబర్ 29, 30 తేదీలలో అణ్ణామలై విశ్వ విద్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఈ బృందం నాయకుడు డాక్టర్ ఇ. జె. లాంగ్, ఈ బృందంలోని మరిద్దరు సభ్యులు - డాక్టర్ జె పెచ్. మెక్‌లియోడ్, డాక్టర్ ఎ. బి. బాడెన్‌హోప్, ఇంకా తెంగుకూరు వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ బి. వెంకోబారావు, మద్రాసు పశు సంవర్ధన శాఖ డిప్యూటీ డైరెక్టరు డాక్టర్ ఐ.డి. మంత్రమూర్తి, మద్రాస్ వెటర్నరీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వి. డిసౌజ, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చి అధిపతి డాక్టర్ కె. సి. నాయక్, అణ్ణామలై విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల ప్రొఫెసరు, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఆ. రంగస్వామి వగైరాలు పాల్గొన్నారు. కళాశాలల [illegible] స్థాయిని [illegible] సాంకేతిక సహకార సంస్థ చేస్తున్న కృషిని శ్రీ నారాయణ స్వామి పిళ్ళై వివరించారు.

అణ్ణామలై విశ్వ విద్యాలయంలో వ్యవసాయ కళాశాల అభివృద్ధికి టి. సి. యం. చేస్తున్న సహాయానికి ఆ సంస్థకు ఆయన కృతజ్ఞత తెలిపారు.

వ్యవసాయ విద్యాలయాలలో బోధన, పరిశోధన అభివృద్ధి పరచే పద్ధతులను గురించి ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ ప్రాంతంలోని కళాశాలలకు, ఇంకా టి. సి. ఎం. సహాయాన్ని గురించి నిర్ణయాలు తీసుకోటం జరిగింది.

షెడ్యూల్డు తెగల అభివృద్ధి

వెయ్యి విద్యాలయాల స్థాపన

న్యూఢిల్లీ, అక్టోబర్ 12

దేశంలో షెడ్యూల్డ్ జాతులకు చెందిన వారికై మొత్తం 1000 విద్యాలయాలు స్థాపించబడినట్లు ప్రభుత్వం నేడొక పత్రికా ప్రకటనలో వివరించింది. ఈ విద్యాలయాలు 2 రకాలుగా ఉన్నాయి. మొదటి రకం వాటిని ఆశ్రమాలంటారు. ఈ ఆశ్రమాలలోనే విద్యార్థులు ఉంటూ పట్టణం, కుట్టుపని మొదలైన వృత్తులలో శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంలో అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది. రెండవ రకం వ్యవస్థలను సేవాశ్రమాలు అంటారు. వీనిలో సాధారణ విద్యా బోధనతో పాటు నూలు వడకడం, తోట పని మొదలైన వృత్తులను విద్యార్థులకు బోధిస్తారు. ఈ విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు, నూలు వడకడానికి కావలసిన పరికరాలు ఉచితంగా సరఫరా చెయ్యబడుతున్నాయి. ప్రథమ పంచవర్ష ప్రణాళికలో షెడ్యూల్డ్ తరగతులకు, షెడ్యూల్డ్ జాతులకు చెందిన వారి అభివృద్ధికై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొత్తం 1387 లక్షల రూపాయలను ఖర్చు పెట్టాయి. వెనుకబడిన జాతుల సంక్షేమానికి మొదటి ప్రణాళికలో కేటాయించబడిన సొమ్ము 3287 లక్షలు. ఇందులో షెడ్యూల్డ్ జాతులవారి అభివృద్ధికి నూటికి 32.6 వంతులు ఖర్చు చేయబడింది. ద్వితీయ ప్రణాళికలో షెడ్యూల్డ్ తరగతులకు, జాతులకు చెందినవారి విద్యాభివృద్ధి కార్యక్రమాలకు 3237 లక్షల రూపాయలు కేటాయించబడ్డాయి. ఈ మొత్తం కాక రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలో చేరని కార్యక్రమాల రూపంలో కూడా వీరి సంక్షేమానికై అధిక మొత్తాలను ఖర్చు చేస్తున్నాయి.

వ్యవసాయ

గురువారం, అక్టోబర్ 15, 1959

హైద్రాబాద్ [ఎ]

405.4 మీ (740 కిలోసైకిళ్లు)

ఉ॥ 6-40 భక్తి రంజని, 7-15 మొహమ్మద్ ఖాసిమ్: క్లారినెట్ 7-45 సంగీత శిక్షణ.

మ॥ 12-30 సినీగీతి (గ్రా. 8.) 1-30 ఖవ్వాలి నాట్ (8 కార్డులు) 2-00 శాస్త్రీయ సంగీత్ (8 కార్డులు) 3-45 మాధ్యమిక పాఠశాలలకు.

సా॥ 7-15 ఉర్దూ పద్య పఠనము 7-30 గతంలోకి నడిచి వెళ్లితే; కొండాపూర్: ప్రసంగము 7-40 విరామ సంగీతం (8 కార్డులు) 7-45 రాగం, తానం, పల్లవి 8-30 రేడియో వార్తా వాహిని 8-40 విరామ సంగీతం (8 కార్డులు) 8-45 సుగమ్ సంగీత్ (స్టూ. 8.) 9-30 అఖిల భారత సాహిత్య కార్యక్రమము.

బి

30.86 మీ (9720 కిలోసైకిళ్లు)

మ॥ 1-00 ఎస్. భానుమతి 2-10 శాస్త్రీయ సంగీత్ (8 కార్డులు) 2-20 ఎస్. భానుమతి.

60.14 మీ (4988 కిలోసైకిళ్లు)

సా॥ 6-15 ఫిల్మ్‌గీతం (8 కార్డులు) 9-15 లలిత సంగీత్: నేతి శ్రీరామశర్మ.

విజయవాడ

357.1 మీ (840 కిలోసైకిళ్లు)

ఉ॥ 6-40 భక్తిరంజని: పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసు కీర్తనలు 7-15 మొహమ్మద్ ఖాసిమ్: క్లారినెట్ 7-45 సంగీత శిక్షణ.

మ॥ 1-00 పెమ్మరాజు సూర్యారావు 1-30 ద్వారం వెంకటస్వామి నాయుడు: వయొలిన్ (8 కార్డులు) 3-30 వయొలిన్: నిలయవిద్వాంసుడు 3-45 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు.

సా॥ 7-30 గతంలోకి నడిచి వెళ్లితే: కొండాపూర్ (ప్రసంగము) 7-40 విరామ సంగీతం (8 కార్డులు) 7-45 రాగం, తానం, పల్లవి 8-30 రేడియో వార్తావాహిని 8-40 మొహమ్మద్ ఖాసిం: క్లారినెట్ 9-15 ఫిల్మ్‌సంగీతం (8 కార్డులు) 9-30 అఖిలభారత సాహిత్య కార్యక్రమము 10-00 పెమ్మరాజు సూర్యారావు.

ధరవరలు

కొత్తూరు సీతయ్య గుప్త దుకాణం

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్, ఆం. ప్ర.

మంగళవారం, 13-10-1959

సన్న బియ్యము	71-0-0	80-0-0
దొడ్డు బియ్యము	62-0-0	64-0-0
అక్కులు ,,	67-8-0	68-8-0
19 నెం. బి॥	65-0-0	68-0-0
తెల్ల జొన్నలు	53-8-0	55-0-0
చట్టి ,,	45-0-0	46-0-0
పచ్చ	40-0-0	41-0-0
పసుపు	115-0-0	125-0-0
ఎర్రకందులు ఉ॥	48-0-0	53-0-0
పెసలు	53-8-0	55-4-0
మినుములు	52-0-0	56-0-0
శనగలు	46-0-0	—
బెల్లము	67-0-0	85-0-0
మిర్చి	240-0-0	296-0-0
చింతపండు	140-0-0	180-0-0
ఉల్లిగడ్డ	22-0-0	31-8-0
గోధుమలు	96-12-0	98-0-0
ఎర్రగోధుమలు	75-0-0	—
కుసుమలు	53-0-0	55-0-0
నువ్వులు	95-0-0	105-0-0
ఇలాతిపలుకు చి॥	68-0-0	—
ఇలాతిపలుకు పె॥	102-0-0	—
ఆముదాలు	66-0-0	—
పత్తిగింజలు	37-0-0	42-0-0
నూనె	18-8-0	—
కందిపప్పు పె॥	88-0-0	90-0-0
కందిపప్పు చి॥	80-0-0	83-0-0
మినప పప్పు	74-0-0	75-0-0
పెసర పప్పు	72-0-0	75-0-0
శనగ పప్పు	53-0-0	57-0-0
నిరిశనగ పప్పు	65-0-0	81-8-0
లంకపప్పు	57-0-0	61-0-0
ధనియాలు	142-8-0	157-8-0
ఇలాతికాయ	38-0-0	48-0-0

వెండి, బంగారం ధరలు

దెబ్బడ భూమయ్య నారాయణ

ఫోన్: నెం. 5260

తేజావు బంగారం		123-25
కిసాన్ మార్క్ బి॥		123-50
వెండి తు॥	100 కి	204-00
వెండి తు॥	1 కి	2-05
నవరసు		79-00

న్యూఢిల్లీ, అక్టోబర్ 12

బొంబాయి హైకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ జె. సి. షా నేడు సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నేడు ఇక్కడ ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ బి. పి. సిన్హా ప్రమాణ స్వీకారం చేయించారు.

యెమెన్ గ్రామాలపై బ్రిటిష్ సైనికుల కాల్పులు

అరబ్ లీగ్ సమావేశంలో ఆరోపణ

కైరో, అక్టోబర్ 12

సరిహద్దు నగరం టెడాకు ఎదురుగా యెమెన్ పర్వత ప్రాంతాల గ్రామాల పై ఏడెన్ రక్షిత ప్రాంతంలోని బ్రిటిష్ సైనికులు గత నాలుగు రోజులుగా బాంబులు వేస్తున్నట్టు యెమెన్ మంత్రి ఒకరు ఆరోపించారు.

యెమెన్ రాజు ఇమాం పక్షాన అరబ్ లీగ్ సమావేశంలో పాల్గొంటున్న శ్రీ హసన్ ఇబన్ అలి ఇబ్రహీం నిన్నటి దినం ఇక్కడ ఒక ప్రకటన లో పై ఆరోపణ చేసారు.

గత అక్టోబర్ 4 వ తేదీన బ్రిటిష్ విమానం ఒకటి రెచ్చగొట్టే ఉద్దేశంతో టెడా నగరంపైకి వచ్చినదనీ, మరో సారి మరో విమానం యెమెన్ రాజధానిపై విహరించినదనీ ఆయన ఆరోపించారు.

కన్సర్వేటివ్ పార్టీ మెజారిటీ 102

లండన్, అక్టోబర్ 10

బ్రిటిష్ ఎన్నికలలో ఆఖరి ఫలితం నేడు వెల్లడి కావటంతో కన్సర్వేటివ్ పార్టీకి కామన్స్ సభలో మొత్తం 102 స్థానాలు లభించినవి.

ఆర్థిక నియోజకవర్గంలో కన్సర్వేటివ్ పార్టీ అభ్యర్థి మునుపటి కంటే హెచ్చు మెజారిటీతో తన సీటును నిలబెట్టుకొన్నాడు.

కామన్స్ సభలో పాలిత బలాబలాలు ఇప్పుడు ఇలా ఉన్నవి: కన్సర్వేటివ్ పార్టీ 366, లేబర్ పార్టీ 258, లిబరల్ పార్టీ 6.

సమితి ఆర్థిక, సాంఘిక సంఘానికి జపాన్ ఎన్నిక

న్యూయార్క్, అక్టోబర్ 12

మిత్రరాజ్య సమితి ఆర్థిక, సాంఘిక సంఘానికి భారతదేశం పోటీ నుంచి విరమించడం వల్ల జపాన్ ఎన్నికైనది. ఈ సంఘానికి భారతదేశం కూడా పోటీ చేయడం వల్ల ముందు జరిగిన 6 ఓటింగులలోనూ సభ్యత్వానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీ జపాన్‌కు లభించలేదు.

ఈ పోటీ నుంచి భారతదేశం విరమిస్తున్నదని భారత ప్రతినిధివర్గ నాయకుడు శ్రీ కృష్ణమీనన్ ప్రకటించిన తరువాత జరిగిన పోలింగులో జపాన్ ఎన్నికైనది. పోటీ తీవ్రంగా ఉండడం వల్ల మొదటి ఆరు పోలింగులలోనూ ప్రతిష్టంభన ఏర్పడి ఏ దేశానికీ కావలసిన సంఖ్యాబలం రాలేదు. కాని అన్ని ఓటింగులలోనూ జపాన్ భారతదేశం కంటె అధికసంఖ్యా బలాన్ని సంపాదించింది.

ఓటింగును పరిశీలిస్తే జపాన్‌ను ఎక్కువ దేశాలు సమర్థిస్తున్నాయని తెలుస్తున్నదనీ, అందువల్ల పోటీ నుంచి భారతదేశం విరమించిందనీ శ్రీ కృష్ణమీనన్ ప్రకటించగానే హర్షధ్వానాలు నెలకొనగాయి. ఆర్థిక, సాంఘిక సంఘంలో ఉన్న మిగిలిన 5 ఖాళీలకు ఇంగ్లండ్, బ్రెజిల్, రష్యా, డెన్మార్క్, పోలండ్ దేశాలు ఎన్నికయ్యాయి.

మునిసిపల్ ఉప ఎన్నికలు

హైద్రాబాద్, అక్టోబర్ 12

శ్రీయుతులు మక్బూల్ అహమ్మద్ జమై, సయ్యద్ అహమదుల్లాఖాద్రీ గారలు రాజీనామా చెయ్యగా ఏర్పడిన హైద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ స్థానాలకు నవంబర్ 14 వ తేదీన ఎన్నికలు జరుగుతాయని నేడు వెలువడిన అసాధారణ గెజిట్‌లో ప్రకటించారు.

పై ఇద్దరు బర్గాయానపైన్ కుతీగూడా నియోజక వర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులుగా ఎన్నికైనారు. ఉప ఎన్నికల కార్యక్రమం వివరాలు ఇవి: నామినేషన్ల సమర్పణ అక్టోబర్ 17; నామినేషన్ పత్రాల పరిశీలన అక్టోబర్ 19, నామినేషన్ పత్రాల ఉపసంహరణకు గడువు అక్టోబర్ 28, అప్పీలు చేసిన సందర్భంలో నామినేషన్ పత్రాల ఉప సంహరణకు ఆఖరు తేదీ అక్టోబర్ 28, పోలింగ్ నవంబర్ 14.

కాపు సారా స్వాధీనం

ఇల్లెందు, అక్టోబర్ 8

కె. లక్ష్మీబాయిఅనే ఆమె ఇంట్లో ఆబ్కారీ సబ్ యిన్‌స్పెక్టర్ జమాలుద్దీన్, మరియు కంట్రాక్టర్ బాలాగౌడ్ గారలు సోదా జరిపించగా 11 సీసాలకు పైగా కాపు సారాయి లభించినది. అక్రమ సారాయి తయారు చేయుటకు బాధ్యురాలైనలక్ష్మీబాయిపై కోర్టులో కేసు పెట్టబడినది.

యీ ప్రాంతాన యింకా కొందరి ఇళ్ళు సోదా జరుపనున్నట్లు తెలుస్తున్నది.

శ్రీ యోగాశ్రమము, వాల్తేరు
డాక్టర్లకు సాధ్యముగాక వదిలివేయ బడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. వివరములు కోరువారు 0-12-0 పంపిన, ఆశ్రమ నివేదిక పంపబడును.

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, సాంకేతిక విద్యా శాఖ

వృత్తి పనివారల శిక్షణ పథకం-ప్రవేశాలు నవంబరు 1959

వృత్తి పనివారల శిక్షణ పథకం క్రింద ఈ క్రింది పారిశ్రామిక శిక్షణ సంస్థలలో వివిధ సాంకేతిక, వృత్తి పనులలో శిక్షణ పొందుటకు దరఖాస్తులు కోరబడుతున్నవి:

ఆంధ్ర ప్రాంతం

పారిశ్రామిక శిక్షణ సంస్థ - కాకినాడ

1. మెకానిక్ (మోటారు) 2. మెకానిక్ (ఇన్‌స్ట్రుమెంట్) 3. మెకానిక్ (రేడియో) 4. ఎలక్ట్రీషియన్లు 5. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) 6. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్) 7. టర్నర్లు 8. జనరల్ మెకానికులు (ఫిట్టర్స్) 9. వడ్రంగులు.

పారిశ్రామిక శిక్షణ సంస్థ - ఉయ్యూరు

1. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) 2. ఎలక్ట్రీషియన్లు 3. వడ్రంగులు 4. ఫిట్టర్లు 5. టర్నర్లు 6. మిషను పనివారలు 7. వెల్డర్లు 8. మౌల్డర్లు

పారిశ్రామిక శిక్షణ సంస్థ-అనంతపురం

1. ఎలక్ట్రీషియన్లు 2. కమ్మర పనివారలు 3. మిషను పనివారలు 4. ఫిట్టర్లు 5. మోటారు మెకానికులు 6. టర్నర్లు 7. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్) 8. మౌల్డర్లు

పారిశ్రామిక శిక్షణ సంస్థ-నెల్లూరు

1. ఎలక్ట్రీషియన్లు 2. ఫిట్టర్లు 3. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్) 4. టర్నర్లు 5. వడ్రంగులు 6. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్)

పారిశ్రామిక శిక్షణ సంస్థ-విశాఖపట్నం

1. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్) 2. మౌల్డర్లు 3. లైన్‌మెన్, వైర్‌మెన్ 4. టర్నర్లు 5. ఫిట్టర్లు 6. వడ్రంగులు 7. సీసపు పనివారలు 8. పాటర్న్ పనివారలు 9. షీట్ మెటల్ పనివారలు.

తెలంగాణా ప్రాంతం

పారిశ్రామిక శిక్షణ సంస్థ-మల్లేపల్లి, హైద్రాబాద్

సాంకేతిక పనులు

1. ఎలక్ట్రీషియన్లు, 2. మోటారు మెకానికులు, 3. ఫిట్టర్లు, 4. టర్నర్లు, 5. మౌల్డర్లు, 6. మెకానిస్టులు, 7. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్) 8. షీట్ మెటల్ పనివారలు, 9. రేడియో మెకానికులు, 10. మెకానికులు (ఐ.సి. ఇంజన్లు), 11. ఎలక్ట్రో ప్లేటర్లు, 12. లైన్‌మెన్, వైర్‌మెన్, 13. వడ్రంగులు, 14. కమ్మర పనివారలు, 15. సీసపు పనివారలు.

వృత్తి పనులు

1. దర్జీపని, 2 భవన నిర్మాణ వృత్తులు, 3. తోళ్ల పని, 4. సాధారణ నేత, 5. ప్రత్యేక నేత, 6. పేము అల్లికం.

పారిశ్రామిక శిక్షణ సంస్థ- నిజామాబాద్.

సాంకేతిక పనులు

1. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), 2. డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్), 3. ఫిట్టర్లు, 4. టర్నర్లు, 5. ఎలక్ట్రీషియన్లు, 6. లైన్‌మెన్, వైర్‌మెన్, 7. వడ్రంగులు, 8. కమ్మర పనివారలు.

వృత్తి పనులు

1. దర్జీ పని.

పారిశ్రామిక శిక్షణ సంస్థ (ప్రభుత్వ పాలిటెక్నిక్, హైద్రాబాద్)

1. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), 2. సర్వేయర్లు.

2. వివిధ సాంకేతిక పనులలో రెండు సంవత్సరాల పాటు శిక్షణ జరుగుతుంది. వర్క్‌షాప్ నిబంధనల క్రింద ఫ్యాక్టరీలలో ఆరు నెలల పాటు పొందవలసిన నిర్బంధ ఇన్‌ప్లాంట్ శిక్షణ కూడా ఈ కాలంలోనే వుంటుంది. అభ్యర్థుల వయస్సు సాధారణంగా 16-25 సంవత్సరాల మధ్య వుండవలెను. రాష్ట్రంలోని మాజీ సైనికులకు ఒకవేళ వారు ఇతరత్రా అర్హులైనట్లయితే వయః పరిమితితో నిమిత్తం లేకుండా యీ శిక్షణలో ప్రవేశం పొందడానికి అర్హత వుంటుంది. నిమ్నజాతులు, నిమ్న తెగలకు చెందిన అభ్యర్థుల విషయంలో గరిష్ఠ వయః పరిమితి 28 సంవత్సరాలు. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్), డ్రాఫ్ట్స్‌మెన్ (మెకానికల్), ఎలక్ట్రీషియన్లు, సర్వేయర్లు, మెకానికులు (ఇన్‌స్ట్రుమెంట్), మెకానికులు (రేడియో) శిక్షణ పొందదలచిన దరఖాస్తుదారులు ఎస్. ఎస్. ఎల్. సి., లేక హెచ్.ఎస్.సి. లేదా మెట్రిక్యులేషను పరీక్షలో ఉత్తీర్ణులై వుండవలెను. హైద్రాబాద్, నిజామాబాదుల లోని పారిశ్రామిక శిక్షణ సంస్థలలో వృత్తి పనులలో శిక్షణ పొందదలచిన వారు ఆరవ తరగతి పరీక్షలో ఉత్తీర్ణులై వుండవలెను. మిగిలిన పనులలో శిక్షణ పొందదలచిన వారు ఎస్. ఎస్. ఎల్. సి. లేక హెచ్. ఎస్. సి లేదా మెట్రిక్యులేషనుకు రెండు సంవత్సరాలు తక్కువైన తరగతి వరకు చదివి వుండవలెను.

యోగ్యమైన సందర్భాలలో ఒకవేళ దరఖాస్తుదార్లు ఇతరత్రా అర్హులైనట్లయితే గరిష్ఠ వయః పరిమితి, విద్యా యోగ్యతలకు సంబంధించిన నిబంధన సడలింపబడతాయి. ప్రవేశం పొందడానికి పురుషులు, స్త్రీలు కూడా అర్హులు.

3. శిక్షణ ఉచితంగా ఇవ్వబడుతుంది. శిక్షణకు చేర్చుకోబడు అభ్యర్థులలో సుమారు మూడింట ఒక వంతు మందికి న

దక్షిణాఫ్రికా భారతీయులు
రాజకీయ హక్కుల నిరాకరణ

పీటరు మారిట్సుబర్గ్, అక్టోబర్ 12

దక్షిణాఫ్రికా భారతీయులు తమ స్వదేశానికి వెడితే అక్కడ పూర్తి హక్కులు పొందగలరు కనుక వారికి రాజకీయ హక్కులను ఇచ్చే అవశ్యకత ఉన్నట్లు తన ప్రభుత్వం భావించడం లేదని దక్షిణాఫ్రికా విద్యా శాఖా మంత్రి నేడిక్కడ అన్నారు. ప్రత్యేక నివాస ప్రాంతాల చట్టం అమలు చేయబడుతుందనీ, దాని ప్రకారం తమకు కేటాయించిన ప్రదేశాలలో భారతీయులు నివశించాలనీ ఆయన అన్నారు. భారతీయులకు ప్రత్యేకించబడిన యీ ప్రత్యేక ప్రాంతాలలో వారికి కొన్ని హక్కులను ప్రభుత్వం ఇస్తుందని ఆయన చెప్పారు. భారతీయులకు హక్కులు ఇవ్వాలన్న సమస్య ప్రస్తుతానికి పెద్ద ప్రాముఖ్యంగల సమస్య కాదని కూడా ఆయన అన్నారు.

భాగల్పూర్, అక్టోబర్ 12

భాగల్పూర్ జిల్లాలో కుంభ వృష్టి ఫలితంగా మొత్తం 15 వేల మట్టి ఇండ్లు దెబ్బతిన్నాయి.

నేడే చూడండి! నేడే చూడండి!!

గురుదత్ వారి భారత దేశపు ప్రప్రథమ సినిమా స్కోప్ చిత్రం....

కాగజ్ కె ఫూల్

వహీదా రెహమాన్, గురుదత్, జాలీనాజ్, జానీవాకర్, మీనూముంతాజ్.

అశోక్-హైదరాబాద్ మనోహర్-సికిందరాబాద్

రెండు థియేటర్లలో సినీమా స్కోప్ లెన్సు, స్క్రీన్ ఏర్పాట్లు చేయబడినవి. రెండు థియేటర్లలోను ఆదివారం అక్టోబర్ 18 వరకు 3 ఆటలు: 3-30, 6-30, 9-30.

(Trupix) —జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్—

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, హైద్రాబాద్

టెండరు ప్రకటన

విషయం:- కమీర్ పేట నుంచి మేడ్చల్ వరకు 0/0 మైలు నుంచి 7/0 వరకు చిన్న రాతి కట్టడం పనులతో సహా రోడ్డు నిర్మాణం.

పై పనులకు టెండర్లు తీసుకోటానికి మొదట 20-10-59 ఆఖరు తేదీగా నిర్ణయింపబడింది. ఇప్పుడది 29-10-59 వరకు పొడిగింపబడింది. టెండర్లు 29-10-59 మధ్యాహ్నం 3-30 గంటల వరకు తీసుకొనబడతాయి. అదే రోజు మధ్యాహ్నం 4 గం.కు విప్పబడతాయి.

ప్లాన్‌లు, స్పెసిఫికేషన్లతో కూడిన టెండరు కాగితాలు దిగువ సంతకం చేసిన వారి కార్యాలయంలో పని రోజులలో 13-10-59 నుంచి 22-10-59 వరకు లభించగలవు. మిగిలిన విషయాలలో యేమీ మార్పు లేదు.

(సం.) టి. వీర్నాథ్‌రాయ్,
వ.వ.శా. సూపరింటెండింగ్ ఇంజనీర్, హెడ్‌క్వార్టర్స్ సర్కిల్, హైద్రాబాద్-ద.

సికిందరాబాద్ మ్యునిసిపల్ కార్పొరేషన్
టెండర్ నోటీస్

సికిందరాబాద్ మ్యునిసిపల్ కార్పొరేషన్, చీఫ్ ఇంజనీర్, లోకల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ పబ్లిక్ హెల్త్, సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు, హైదరాబాద్ జిల్లా వాటర్ వర్క్సులో నమోదు అయిన కంట్రాక్టర్ల నుంచి ఈ దిగువ పేర్కొన్న పనులు చేయటానికి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి.

పని పేరు	కాంట్రాక్టు మొత్తం	ధరావతు చెల్లించవలసిన పైకం
	రూ. న.పై.	రూ. న.పై.
1. ఫ్రాన్సెస్ స్ట్రీట్ ఎలెండ్ నుంచి ఆలిఫెంట్ బ్రిడ్జి వరకు రెండు ప్రక్కల కాలిబాట నిర్మించుట. వెల్‌కం హోటల్ దగ్గర కొంత భాగం రాళ్ళు పరచి చదును చేయుట.	19,050-00	525-00.
2. సజ్జన్‌లాల్ వీధిలో నెం. 4230ఇంటి నుంచి గల సందులో పాబాద్ రాళ్ళు పరచి చదను చేయుటకు.	3,335-00	83-00
3. నల్లగుట్టలో ఫాసుమియా బేకరీ వద్ద బహిర్గత మురుగు కాలవకు బదులు అంతర్గతమురుగు కాలవను నిర్మించుటకు.	4,083-00	102-00

షరా:
1. ఈ ఆఫీసు నుంచి రూపాయి చెల్లించి టెండర్ ఫారాలు పొందవచ్చును.
2. పూర్తి వివరాలతో కూడిన ప్లానులు, కాంట్రాక్టు నియమ నిబంధనలు, ఆఫీసు పనిచేయు రోజులలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఆఫీసులో చూడవచ్చును.
3. టెండర్లు 21-10-1959వ తేదీ మధ్యాహ్నం 1గంటవరకు సిటీ ఇంజనీర్ తీసికొనెదరు.

సిటీ ఇంజనీర్,
సికిందరాబాద్ మ్యునిసిపల్ కార్పొరేషన్.

16-10-59, శుక్రవారం మ॥ 12-15లకు ప్యాలెస్‌లో బ్రహ్మాండమైన విడుదల!

మరి ఏ ఇతర చిత్రం దీనితో సరిపోలదు....ఇంతవరకు మీరు చూడలేదు.... అసాధారణమైన, అద్భుతమైన హిట్లు గల మనోరంజకమైన డ్యాన్సులతోను, కళతోను నిండిన చిత్రరాజం.... కుమారి ఉషా ఖన్నా సంగీతం కూర్చారు ఇంత చిన్న వయస్సులో ఈమె ఒక్కటే సంగీతం కూర్చినది.

ఫిల్మాలయా వారి

దిల్ దేకె దేఖో

ఆశా పరేఖ్ (నూతన నటి), షమ్మీకపూర్, సులోచన, రాజ్ మెహరా, ముంతాజ్ అలీ, వస్తి, రణధీర్, సురేందర్, కొత్తనటులు: సిద్దూ, మాలిక

నిర్మాత ఎస్. ముఖర్జీ | దర్శకత్వం నజీర్ హుసేన్ | సంగీతం కుమారి ఉషా ఖన్నా

ప్యాలెస్—హైదరాబాద్ అజంతా—సికిందరాబాదు

(Trupix) — చిత్రకళా పిక్చర్స్ రిలీజ్ —

అహూజాతో ప్రేమకలాపం గురించి సిల్వియా సాక్ష్యం
బొంబాయి వర్తకుని హత్య కేసు

బొంబాయి, అక్టోబర్ 13

అహూజాహత్యకేసులో బొంబాయి సెషన్స్ జడ్జి కోర్టులో ఈరోజున నిందితుడు కమాండర్ కె.ఎం. నానావతి భార్య సిల్వియా నానావతి (28) డిఫెన్స్ తరఫున సాక్ష్యమిచ్చినది.

పరిశుభ్రమైన తెల్లనిచీర, రవికధరించి వచ్చిన సిల్వియా న్యాయవాదులడిగిన ప్రశ్నలకు నెమ్మదిగాను, స్పష్టంగాను సమాధానాలిచ్చినది. ఆమెకంఠధ్వనిలో అప్పుడప్పుడు విషాదం ప్రస్ఫుటించినది.

డిఫెన్స్ న్యాయవాది ప్రశ్నలకు సమాధానమిస్తూ శ్రీమతి సిల్వియా 1949 జూలైలో తనకు కమాండర్ నానావతితో పెళ్ళి అయిందని, తనకు 9 1/2, 5 1/2, 3 సంవత్సరాల వయస్సుకల ముగ్గురు పిల్లలున్నారని చెప్పినది. మూడేళ్ల క్రితం ఆమెకు అహూజాతో పరిచయం ఏర్పడింది. అహూజాతో పరిచయం ఏర్పడకముందు ఆమె వైవాహిక జీవితం చాలా సుఖ ప్రదంగా గడించినది. అహూజాతో ఆమెకు సుమారుగా 1958 సంవత్సరారంభంలో సంబంధం ఏర్పడినట్టు ఆమె చెప్పినది.

అయితే ఈ సంబంధంగురించి తాను గత ఏప్రిల్ 27 నాటివరకు భర్తకు చెప్పలేదని మె ఆలన్నది. ఏప్రిల్ 27వ తేదీనాడు జరిగిన సంఘటనల గురించి ఆమె ఇలాచెప్పినది: ఆమె, ఆమెభర్త ఉదయం ప్రేయర్ లో పశువైద్యశాలకు వెళ్ళారు. కొలాబాలోని తమ ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో ఆమె సినిమా వద్ద ఆగి తనకు ఒకటి, ముగ్గురు పిల్లలకు మూడు టిక్కట్లుకొన్నది. క్రాఫర్డ్ మార్కెట్ లో కొన్ని వస్తువులు కొను క్కొని 12.30 గంటలకల్లా ఇంటికి తిరిగి వచ్చారు.

భోజనం చేయబోయేముందు నానావతి దగ్గరకువచ్చి ఆమెను దగ్గరకు తీసుకొనబోగా ఆయనంటే తనకు ఇష్టం లేదని చెప్పి ఆమె వారించినది. భోజనం తర్వాత నానావతి పడక గదిలోకి వెళ్లిమేను వాల్చాడు. ఆమె బయటగదిలో కూర్చున్నది. కొంచెంసేపటి తర్వాత భర్త బయటకు వచ్చి ఈ విషయం ఏమిటో స్పష్టంగా మాట్లాడి తేల్చేసుకోవాలని ఆమెతోఅన్నాడు. "గతకొన్ని రోజులుగా నీవు నా పట్ల అనాదరణ చూపుతున్నావు" అని ఆయన అన్నాడు. "కారణమేమిటి నీవు నన్ను ప్రేమించటం లేదా" అని కూడా ఆయన అడిగారు.

తాను జవాబేమీ చెప్పలేదని ఆమె తెల్పినది. అప్పుడు నానావతి ఇంకెవరినైనా ప్రేమిస్తున్నావా అని అడిగాడు. ఆమె "అవును" అన్నది, అవ్యక్తి ఎవరో ఆయన తెలుసుకోగోరాడు. కాని ఆమె చెప్పలేదట.

ఆమె ఇంకా ఇలా చెప్పినది: "అప్పుడాయన అహూజానా అని అడిగాడు. నేను ఔనన్నాను. నేను ఆయనకు ద్రోహం చేయలేదు గదా అని ఆయన అడిగాడు. చేశానని నేను చెప్పాను."

నానావతి దిగ్భ్రాంతి చెంది కూర్చున్నాడు. హఠాత్తుగా కొంచెం ఉద్రేకంతో లేచి అహూజా ఇంటికి వెళ్లి విషయం తేల్చేస్తా నన్నాడు. అప్పుడు ఆమెకు చాలా భయం వేసింది. భర్త చేయిని పట్టుకొని "అక్కడికి వెళ్ళవద్దు" అన్నది. "ఆయన నిన్ను కాల్చిపారేయవచ్చు" అని కూడా అన్నది, అప్పుడాయన "నాగురించి ఆందోళన పడకు, ఎలాగైనా నన్ను నేనే కాల్చి చంపుకుంటాను" అనిఅన్నాడు. అప్పుడు ఆమె ఆయన చేయి పట్టుకొని ఆయన ఆవేశం చల్లార్చటానికి ప్రయత్నించినది. "నీవెందుకు ఆత్మహత్య చేసుకోవాలి. దీనిలోనే తప్పేమీ లేదు." అని కూడా తాను అన్నట్టు ఆమె చెప్పినది.

అప్పుడు ఆయన కొంచెం తగ్గాడని, అహూజా నిన్ను పెళ్ళి చేసుకొని, పిల్లలను పోషించడానికి సిద్ధంగా ఉన్నాడా అని ప్రశ్నించాడని ఆమె చెప్పినది. అహూజా తనను పెళ్ళి చేసుకోగూడదన్నట్టు ప్రవర్తిస్తున్నాడని తనకు తెలుసు గనుక చెప్పుకోవటం సిగ్గుచేటు అని పించి తాను ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని ఆమె అన్నది. మళ్లీ జన్మలో ఎన్నడూ అహూజాను చూడనని మాట ఇస్తే నిన్ను క్షమిస్తానని భర్త అన్నాడని అయితే, అలా మాట ఇవ్వటానికి తాను జంకినట్టు ఆమె చెప్పినది,

న్యాయవాది: ఎందుకు జంక వలసి వచ్చినది?

సిల్వియా: అహూజాపై ఇంకా నాకు మోహం తీరలేదని, అందుకు జంకానని ఈ ప్రశ్న నాభావి జీవితాన్ని పూర్తిగా మార్చివేయగలదు. కనుకనే అప్పటికప్పుడు నేను సమాధానం ఇవ్వలేకపోయాను

అంతలో డోర్ బెల్ మ్రోగి పొరుగింటి అబ్బాయి సినిమాకు పోవడానికి వచ్చాడని ఆమె చెప్పినది. ఇక ఈ విషయాన్ని గురించి మాట్లాడ వద్దని, మర్నాడు ఉదయం మాట్లాడుకో వచ్చని వారు అనుకొన్నారు.

తర్వాత వారు సినిమాకు వెళ్లారు. భర్తను కూడా రమ్మని ఆమె కోరినది. కాని ఆయన రాలేదు. కారులో వారిని సినిమా వద్ద దింపి భర్త తాను కుక్కముందు కోసం ఐ. ఎస్. ఎస్. మైసూర్ (నౌక) కు వెడుతున్నట్టు, సినిమా పూర్తయిన తర్వాత వారిని ఇంటికి తీసుకొని పోతానని అన్నట్టు ఆమె చెప్పినది.

సినిమా అయిపోయిన తర్వాత బయటకు వచ్చి చూస్తే భర్త లేడు. భర్త స్నేహితు డొకరు ఆమెను ఇంటి వద్ద దింపాడు. అక్కడ ఈ సంఘటన గురించి ఆమెకు తెలిసినది. ఇంటి తాళం చేతులు ఆమె భర్త తీసుకొని వెళ్లారు.

అహూజా ఇల్లు తనకు తెలుసునని, అక్కడికి అనేక సార్లు వెళ్లానని ఆమె చెప్పినది. ఆమె భర్త మాత్రం రెండు, మూడు సార్లే వెళ్ళాడు. తమ సంబంధాన్ని గురించి అహూజా, ఆమె ఇద్దరు కలిసి 1958 అక్టోబర్ లోనో, నవంబర్ లోనో అహూజా సోదరికి చెప్పినట్టు ఆమె తెలిపినది.

భర్తకు ఈ విషయం తెలిస్తే మిస్ అహూజాకు తలనొప్పి వచ్చిందని అందుకు వెళ్ళానని చెబుతానని తాను అన్నట్టు అందుకు మిస్ అహూజా అంగీకరించినట్టు సిల్వియా చెప్పినది.

గత జనవరిలో తాను ఢిల్లీ వెళ్లినట్టు ఆమె చెప్పినది. అప్పుడు అహూజా, ఆయన సోదరి అక్కడే ఉన్నారు. జనవరి ఆఖరులో ఆమె అహూజా, ఆయన సోదరితో కలిసి ఢిల్లీ నుంచి బొంబాయి వచ్చినది.

అహూజా తన ఇంట్లో సారా ఉంచుతూ ఉండేవాడని ఆమె చెప్పినది. అహూజాబ్రతికి ఉండగా ఆయన ఏర్పాటు చేసిన అనేక పార్టీలకు ఆమె వెళ్లినది. అహూజా ఫొటోను ఆమె గుర్తించినది.

సిల్వియా మరోఫొటోను అహూజా "పూర్వపు భార్య" అని గుర్తించినది. (ఈ ఫొటోలు అహూజా ఇంట్లో పంచనామా సందర్భంగా పశ్చరచుకోబడినవి), మరో రెండు ఫొటోలు తనవని ఆమె గుర్తించినది. కాని ఇంకా రెండు ఫొటోలు ఎవరివో ఆమె గుర్తుపట్టలేదు.

అప్పుడు ఆమెకు మూడు ఉత్తరాలు చూపించబడినవి. ఆ ఉత్తరాలు తానే వ్రాసినట్టు మే 24 తేదీ గల ఉత్తరం 1958 లో, మార్చి 19 వ తేదీ గల ఉత్తరం 1959 లో వ్రాసినట్టు ఆమె చెప్పినది. 1958 మే 24 ఉత్తరం అప్పుడు పంపలేదు. తర్వాత 1959 మార్చి 19 వ తేదీ నాటి ఉత్తరంతో కలిపి పంపినది.

డిఫెన్స్ న్యాయవాది: నాడు ఉత్తరం వ్రాసి దానిని ఇంచుమించు ఒక సంవత్సరం వరకు ఎందుకు పంపలేదు?

సిల్వియా: పంప లేదు అంతే.

డిఫెన్స్ న్యాయవాది అప్పుడు ఉత్తరాలలో కొన్ని వాక్యాలను చదివి వాటి భావ మేమిటని ప్రశ్నించాడు. కాని కోర్టు ఆ ప్రశ్నలకు అనుమతించలేదు.

1959 ఏప్రిల్ 17 వ తేదీ నాటి ఉత్తరంలో "నీ వద్ద నుంచి ఒక ఉత్తరమైనా వచ్చినట్టయితే....." అనే వాక్యాన్ని చదివి న్యాయవాది ఇలా ప్రశ్నించాడు: నీవు ఆయనకు (మృతునికి) ఉత్తరాలు వ్రాశావు. ఆయన నీకు ఎప్పుడైనా ఏవిషయమైనా వ్రాశాడా?

సిల్వియా: లేదు,లేదు.ఆయనెప్పుడూ ఉత్తరం వ్రాయలేదు.

ప్రశ్న: అహూజాతోనీకున్నసంబంధం కాక మరోపర పురుషుని కోసం ఎప్పుడైనా నీవు భర్తను వదిలి పోవాలని ఆలోచించావా?

ఈ కేసుతో ప్రశ్నకు సంబంధంలేదని న్యాయమూర్తి ప్రశ్నను త్రోసివేశారు.

పోలీసు కస్టడీలో ఉండగా భర్తను చూడటానికి తనకుఅనుమతిదొరకలేదని, నౌకా కస్టడీలో ఉండగా వారానికి రెండు సార్లు పిల్లలను తీసుకొని వెళ్ళి భర్తకు చూపించే దానినని ఆమె చెప్పినది.

అహూజా ఇంటికి తాను తన భర్త కలిసి వెళ్ళినప్పుడు ఏదోపార్టీ ఉండేదని ఆమె అన్నది.

తర్వాత సాక్షి మృతునికి వ్రాసిన మూడు ఉత్తరాలు పరిశీలనార్థం జ్యూరీకి అందజేయబడినవి.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్రాస్ పరీక్ష సందర్భంగా సిల్వియా, నానావతితో తన పెళ్ళి సివిల్ వివాహమని, విడాకులు ఇచ్చుకోటానికి వీలుందని చెప్పినది.

1958 మే 24 తేదీకి ముందు మృతునికి తాను లేఖను వ్రాయలేదని ఆమె చెప్పినది. 1958 మే 24 తేదీ లేఖను 1959 మార్చి కంటే ముందు ఎందుకు పంపలేదన ప్రశ్నించగా "నాఅభిమానం దెబ్బతిన్నది గనకనే నేనలా చేయలేదని" ఆమె సమాధాన మిచ్చినది.

ప్రాసిక్యూషన్: మే 24వ తేదీకి ముందు నీకు, మృతునికి సంబంధం లేదన సిల్వియా అంగీకరించినదా? నాకు, మృతునికి ఆ తేదీ కంటే ఎన్నో రోజుల ముందే సంబంధం ఏర్పడినది.

ప్రాసిక్యూషన్: మృతునితో సంబంధం పెట్టుకోవటంలో నీదే పైచేయి అనటం నిజమేనా?

ఈ ప్రశ్నకు కేసుతో ఎలా సంబంధం ఉన్నదో అని జడ్జి ప్రశ్నించారు. ఈ విషయంలో ఎవరిది తప్పు, ఎవరిది కాదనే విషయంలో కోర్టుకు నిమిత్తం లేదని జడ్జి అన్నారు.

మిస్ అహూజాతో తనకు 1956 లో పరిచయం కల్గినదని సిల్వియా చెప్పినది, అంతకు ముందే ఆమె మృతుని కలిసినది. అయితే 1958 వరకు వారు కేవలం మిత్రులు మాత్రమే.

ఇతర ప్రశ్నలకు సమాధాన మిస్తూ 1958 పూర్వం మృతుడు తన పట్ల అట్టే ఆసక్తి ప్రదర్శించా డనటం నిజం కాదని ఆమె చెప్పినది. "అంతకు ముందు కూడా అనేక సార్లు నిన్ను పెళ్లి చేసుకుంటానని "ఆయన చెప్పాడు. ఒక నెల, రెన్నెళ్లా తర్వాత ఆయన మారిపోయాడు. పెళ్లి ప్రశ్న వచ్చి నప్పుడు తప్పించుకోవాలని ప్రయత్నించే వాడని ఆమె అన్నది.

ఉత్తరాలు వ్రాయక ముందే తమకు సంబంధం ఏర్పడినదని ఆమె చెప్పినది.

పెళ్లి ప్రస్తావనను ఆయన పూర్తిగా త్రోసివేసే వాడు కాదు. కొంత సేపు దాని గురించి మాట్లాడి, వేరే విషయం మీదకు సంభాషణ మళ్లించే వాడు. ఇది తమకు తొలిసారి సంబంధం ఏర్పడి, తాను మొదటి లేఖ వ్రాయక పూర్వం జరిగిన విషయమని ఆమె చెప్పినది.

పెళ్ళి ప్రస్తావన తాను తీసుకొని రాలేదని ఆమె చెప్పినది. మొదట ఆయనే పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ఆయన ఎప్పుడన్నాడో సరిగా జ్ఞాపకం లేదు కాని అది 1958 మే 24 నాటి తొలి లేఖ వ్రాయక పూర్వం సుమారు రెండు నెలల ముందు అని మాత్రం జ్ఞాపకమని ఆమె చెప్పినది. తొలిసారి సంబంధం ఏర్పడక ముందే ఆయన పెళ్ళి ప్రస్తావన తెచ్చారని ఆమె చెప్పినది.

ఇలాంటి పెళ్ళి వల్ల భర్త, పిల్లల గురించి చిక్కులు ఏర్పడతాయని తనకు తెలుసునని, అయితే వాటి గురించి తాము (మృతుడు, ఆమె) ఎలాటి పరిష్కారానికి రాలేదని ఆమె చెప్పినది.

అహూజాను పెళ్లి చేసుకోబోతున్నానని మిస్ అహూజాతో తానెప్పుడు చెప్పుబోదని సిల్వియా అన్నది. అహూజాను ప్రేమిస్తున్నట్టు, ఆయనను కలుసుకొంటున్నట్టు చెప్పానని, అప్పుడు మిస్ అహూజా తన మెడ చుట్టూ చేతులు వేసి చిరునవ్వు నవ్వి ఊరుకొన్నదని, ఏమీ అనలేదని ఆమె చెప్పినది.

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukaramjahi Road, Hyderabad.

భారత ఇంజనీర్ల నైపుణ్యం
సోవియెట్ రాయబారి ప్రశంస

భిలాయ్, అక్టోబర్ 13

భిలాయ్ ఉక్కు యంత్రాగారం స్థాపనలో భారత, సోవియెట్ దేశాలవారు పరస్పరం అందజేసుకొన్న సహకారం, విభిన్న సామాజిక వ్యవస్థలు విజయవంతంగాను, సమర్థవంతంగాను పరస్పరం సహకరించు కోవచ్చునన టానికి నిదర్శనమని ఇండియాలో సోవియెట్ రాయబారి శ్రీ ఐ.వి. పెదిక్రోవ్ నిన్న అన్నారు.

శ్రీ పెదిక్రోవ్ నిన్న భిలాయ్ యంత్రాగారంలోని తొలి బ్లాస్ట్ ఫర్నేస్ కులాంఛన ప్రాయంగా ప్రారంభోత్సవం చేశారు.

భారత ఇంజనీర్లకు, టెక్నిషియన్లకు జోహారులర్పిస్తూ శ్రీ పెదిక్రోవ్, భిలాయ్ ప్రత్యేకత ఏమిటంటే సోవియెట్ నిపుణుల సహాయంతో నిర్వహించబడిన పనులన్నీ కూడా భారతీయ ఇంజనీర్లు, కార్మికులు స్వయంగా అమలు పరచారని, నిర్మాణ పద్ధతులలోను, ఆధునిక పరికరాలను అమర్చే పద్ధతులలోను వారు త్వరలోనే నైపుణ్యం సంపాదించారని అన్నారు.

"ప్రతిభావంతులైన మీ ఇంజనీర్లు, కార్మికులు రోలింగ్ మిల్లులను నిర్మించి ఉక్కు ఉత్పత్తిలోని అన్ని దశలను పూర్తిచేయగల రోజు త్వరలోనే వస్తుందని ఆయన అన్నారు.

కేరళలో రాజకీయ నాయకులపై కేసుల ఉపసంహరణ

త్రివేంద్రం, అక్టోబర్ 13

ఇటీవల ఆందోళన సందర్భంగా రాజకీయ నాయకులపైనా, ప్రతికూలపైనా పెట్టబడిన 39 కేసులను కోర్టుల అనుమతితో ఉపసంహరించటానికి ఉత్తర్వులు జారీ అయినట్టు నేడిక్కడ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

పై 39 కేసులకు సంబంధించి 58 మంది పై అనేక విధాల ఆరోపణలు చేయబడ్డాయి. వీరిలో శ్రీ పట్టం థానుపిళ్ళై, శ్రీ మన్నాత్ పద్మనాభన్, శ్రీ ఆర్. శంకర్, శ్రీ పన్నంపల్లి గోవిందమీనన్ కూడా ఉన్నారు.

అహింసాయుతమైన ఆందోళన సందర్భంలో అరెస్టయిన పదివేల మందిలో 2700 మంది పై కేసులు ఇదివరకే ఉపసంహరించబడ్డాయి.

సహకార విధానమే ఉత్తమ సాధనం

(1 వ పేజీ తరువాయి)

న్నదని శ్రీ నెహ్రూ అన్నారు

సహకార మిల్లు డైరెక్టర్ల బోర్డు అధ్యక్షుడు శ్రీ ప్రగడ కోటయ్య ప్రధాన మంత్రికి పూలమాలవేసి ఆహ్వానించారు రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రముఖులు కూడా ఉత్సవానికి హాజరైనారు

శ్రీ నెహ్రూ శంకుస్థాపనచేసిన భవనం నిర్మాణానికి సుమారు 40 లక్షల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వేసారు.

శ్రీ నెహ్రూ ఇలా అన్నారు:

"ప్రజల సంక్షేమానికి గాను దేశంలో ఎన్నో కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయి. దేశం అంతటా ప్రజలకు ఉద్యోగావకాశాలు లభించటానికి, అన్ని రంగాలలోనూ ఉత్పత్తి పెరుగుదల సాధించటానికి పంచవర్ష ప్రణాళికలు అమలు జరుగుతున్నాయి.

"పారిశ్రామిక, వ్యావసాయిక, విద్యాభివృద్ధుల కోసం ఎన్నో చర్యలు గైకొనబడ్డాయి. అసలు అంతర్యం ఏమిటంటే ప్రజలకు అధికారాన్ని ఇవ్వటమే మొన్న పంచాయతీసమితినిర్వాచనం జరిగటంతో అధికారం ప్రజల పరం కావటం ప్రారంభమైనది.

"భారీ పరిశ్రమలు, ఫ్యాక్టరీలతో పరిసమానంగా చేనేత పరిశ్రమ, గృహ పరిశ్రమ,లఘు పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందటం అవసరం. చేనేత పరిశ్రమ గాని మరో పరిశ్రమ గాని అభివృద్ధి మన లక్ష్యం. అలా లక్ష్యాన్ని నిర్ణయించుకొని పక్షంలో మనం ఇతర దేశాలతో పోటీ పడలేము.

"సహకార నూలు మిల్లులకు నేత కార్మికులే యజమానులు కావటం ఎంతైనా హర్షణీయం.చాలాముఖ్యమైన విజయం ఇదే ప్రైవేట్ పరిశ్రమ అయి ఉన్నట్టయితే లాభాలన్నీ ఎవరి చేతులలోకో పోయేవి.

"సహకార విధానం మిగతా అన్ని మార్గాల కంటే ఉత్తమమైనది. సహకార కృషిలో ఒకరు మరొకరిని కొల్లగొట్టడం జరగదు. అందువలనే మనం భూముల విషయంలో గాని, పరిశ్రమల విషయంలో గాని సహకార విధానం కావాలంటున్నాం. ప్రతి గ్రామంలోనూ రైతు సహకార సంఘాలు కావాలని కోరుతున్నాం. తర్వాత రైతులకు ఇష్టమైతే సహకార సేద్యం చేసుకోవచ్చు."

చేనేత కార్మికు లంతా సహకార సంఘాలలో చేరగలరని శ్రీ నెహ్రూ ఆశాభావం ప్రకటించారు.

చేనేత కార్మికులను ఉద్దేశించి శ్రీ [illegible]

"మీరంతా చేతితయారు [illegible] నివశిస్తున్నారు. మీ దేశం భారత దేశమని సదా జ్ఞాపకం పెట్టుకోండి. ఆంధ్రప్రదేశ్ మన దేశంలో ఒక భాగం. దేశంలో ప్రతి చోటా ప్రజల శ్రేయస్సుకోసం కృషి సాగిస్తున్నాం. మీరీ విషయాన్ని జ్ఞాపకం పెట్టుకొంటే మీకు ఇంకా ఎక్కువ బలం ఉంటుంది. ఈ సహకార నూలు మిల్లు మీ పరిసర ప్రాంతాల సౌభాగ్యానికి దోహదం చేకూరుస్తుంది. సదా మీరు క్షేమంగా ఉండాలని కాంక్షిస్తున్నాను."

ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి గారు శ్రీ నెహ్రూ ప్రసంగాన్ని తెలుగులోకి అనువదించారు.

సహకార మిల్లు భవనానికి 40 లక్షలు ఖర్చు కాగలదనీ, మిల్లులో 12 వేల కదుళ్ళు ఉంటాయనీ డైరెక్టర్ల బోర్డు అధ్యక్షుడు శ్రీ ప్రగడకోటయ్య స్వాగతోపన్యాసంలో అన్నారు. భవన నిర్మాణానికి ఇప్పుడు 20 లక్షలే ఉన్నాయనీ, రిజర్వు బ్యాంకు ద్వారాగానీ, మరో విధంగా గానీ మరో 20 లక్షల అప్పును ఇప్పించాలని శ్రీ కోటయ్య ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేసారు.

ఆదిలాబాద్ తాలూకా పంచాయతీ అధ్యక్షుల సమావేశం

ఆదిలాబాద్, అక్టోబర్ 13

ఆదిలాబాద్ తాలూకా సర్పంచీల సమావేశంలో పబ్లిక్ వర్క్స్ శాఖా మంత్రి శ్రీ జె. వి. నరసింగరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రాముఖ్యతను వివరించారు. సర్పంచీలు తమ అధికారాన్ని దుర్వినియోగం చెయ్యరాదనీ, జాతీయ ప్రయోజనాలను దృష్టిలో నుంచుకొని కృషి చెయ్యాలనీ విజ్ఞప్తి చేశారు.

జిల్లా కలెక్టర్ శ్రీ శ్రీనివాసాచారి మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి 100 రూపాయలు కేటాయించ బడిందనీ ఆ సొమ్మును అధిక ప్రయోజన కరంగా వినియోగించమనీ విజ్ఞప్తి చేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో 7 పంచాయతీ సమితులు స్థాపించ బడతాయని ఆయన వెల్లడించారు.

మంత్రి శ్రీ నరసింగరావు ఈ జిల్లాలో వన్యమృగ వారోత్సవాలకు అటవీ శాఖ కార్యాలయంలో ప్రారంభోత్సవం చేసి వన్య జీవనాన్ని రక్షించాలనీ, జంతువుల వేటను నిరోధించాలనీ అన్నారు. ఈ ఉత్సవాలకు జిల్లాకలెక్టర్ శ్రీ శ్రీనివాసాచారి అధ్యక్షత వహించారు. పార్లమెంట్ సభ్యుడు శ్రీ ఆశన్న, శాసన మండలి సభ్యుడు శ్రీ గంగారామ్‌గారలుకూడాప్రసంగించారు

6 వ సంయుక్త వారం!

అనుపమ్ చిత్రవారి

సంతాన్

రాజేంద్రకుమార్, జమునికదం, కపూర్ వాల్స్పేన్, జేవేడ్, బాలనటి అశ్విని, కొత్తనటి రీటారాయ్.

దర్శకత్వం: [illegible] | సంగీతం: దత్తారాం

జుమురుద్ హైద్రాబాద్ చిత్ర సికింద్రాబాద్

(Trupix) ఆటలు: 6-30 9-30 - కవితా పిక్చర్స్ రిలీజ్ -

ఒక కవియొక్క స్వప్నాన్ని గూర్చిన గాథ!

రాజ్‌కమల్ కళామందిర్ వారి

నవ్‌రంగ్

(టెక్నికలర్)

* సంధ్య
* మహీపాల్
* వందన
* ఆగా

దర్శకత్వం: వి. శాంతారామ్
సంగీతం: సి. రామచంద్ర

రెండు థియేటర్లలోను స్త్రీలకు ప్రత్యేక స్థలం కలదు.

ప్రభాత్ హైదరాబాద్ ఫోన్: 34543 3-00, 6-15, 9-30

ప్యారడైజ్ (ఎయిర్ కండిషన్డ్) సికిందరాబాద్ ఫోన్: 6964 6-15, 9-30.

శుక్ర, శని, ఆదివారాలు, సెలవు దినాలలో 3 ఆటలు: 3-00, 6-15, 9-30

(Nima) -ది అలంకార్ చిత్ర (ప్రై.) లిమిటెడ్ రిలీజ్ -

ది సిర్సిల్క్ లిమిటెడ్

సిర్పూర్-కాగజ్ నగర్ (సెంట్రల్ రైల్వే)

—: మేనేజింగ్ ఏజంట్లు :—

బిర్లా బ్రదర్స్ ప్రయివేట్ లిమిటెడ్

మామూలు సహజసిద్ధమైన సిల్కుకు ఏవిధంగా రీతిని అసిటేట్ రేయిన్ నూలును, ఇతర రకాల నూలును విలక్షణంగా తయారు చేసే ఆధునిక యంత్రం గల పరిశ్రమలో అగ్రగణ్యమైనది

సుందరమైనవి * మన్నికైనవి
తేలికైనవి * ప్రకాశవంతమైనవి

తూర్పు దేశాలలో ఎక్కడా కూడా అసిటేట్ పద్ధతిని సిల్కును తయారు చేసే ఫ్యాక్టరీ లేదన్నది గమనార్హం.

నేడే చూడండి! నేడే చూడండి!!

ముక్కోటి ఆంధ్రులను మంత్ర ముగ్ధులను చేస్తున్న మేటి చిత్రం...

శ్రీ వెంకట రమణా ఫిల్మ్స్ వారి

బాలనాగమ్మ

దర్శకత్వం: వేదాంతం రాఘవయ్య

తారాగణం: అంజలీదేవి, రాజసులోచన, సూర్యకళ, హేమలత, ఎన్.టి. రామారావు, ఎస్. వి. రంగారావు, రేలంగి, సి.ఎస్. ఆర్., కుటుంబరావు, మాస్టర్ సత్యం.

సంగీతం: టి. వి. రాజు | మాటలు: సముద్రాల (జూనియర్)

దీపక్ మహల్ హైద్రాబాద్